# మీ వేదాంతశాస్త్రమును కట్టుట

## మొదటి పాఠము

## వేదాంతశాస్త్రము అంటే ఏమిటి?

Manuscript

thirdmill
Biblical Education. For the World. For Free.

© 2021 థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్

సర్వహక్కులు ప్రచురణకర్తలవే. ఈ ప్రచురణలోని ఏ భాగమైనను ఏ రూపములోనైనను లేదా ఏ సాధనము ద్వారానైనను ప్రచురణకర్తలైన థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్, ఐఎన్సి, 316 లైవ్ ఓక్స్ బిఎల్విడి, కాసిల్ బెర్రీ, ఫ్లోరిడా 32707, నుండి వ్రాతపూర్వకమైన అనుమతి పొందకుండా పునఃసమీలలో క్లుప్తంగా ఉల్లేఖింపబడుట, వ్యాఖ్యానించుట, లేదా పాండిత్యము సంపాదించు ఉద్దేశం కొరకు మినహా పునఃర్ముద్రింపకూడదు.

మరొక విధంగా సుచింపబడితే తప్ప ఇందులోని లేఖన ఉల్లేఖనములన్నియు తెలుగు OV వెర్షన్ నుండి తీసికొనబడినవి. కాపిరైట్ © ది బైబిల్ సొసైటీ అఫ్ ఇండియా.

## థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్

1997లో స్థాపించబడిన థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ఒక లాభాపేక్షలేని ఇవాంజెలికల్ క్రైస్తవ పరిచర్యగా లోకమునకు ఉచితముగా బైబిలు సంబంధమైన విద్యను అందించుటకు ప్రతిష్టింపబడింది.

**బైబిలు విద్య. లోకము కొరకు. ఉచితముగా.**

ప్రపంచవ్యాప్తముగా పరిచర్య కొరకు తగిన తర్ఫీదులేని కొన్ని వందల వేల మంది క్రైస్తవ నాయకులకు ఉచిత క్రైస్తవ విద్యను అందించుట మా లక్ష్యమైయున్నది. ఆంగ్లము, అరబిక్, మాండరిన్, రష్యన్, మరియు స్పానిష్ భాషలలో సాటిలేని మల్టీమీడియా సెమినారిని సిద్ధపరచి, విశ్వవ్యాప్తముగా పంచిపెట్టుట ద్వారా మేము ఈ లక్ష్యమును చేధించుచున్నాము. మా పరిచర్య భాగస్వాముల ద్వారా మా పాఠ్యాంశములు ఒక డజను కంటే ఎక్కువ భాషలలో ప్రస్తుతము అనువదించబడుచున్నాయి. ఈ పాఠ్యాంశములలో చిత్రములతో కూడిన వీడియోలు, ముద్రించబడిన ఉపదేశములు, మరియు ఇంటర్నెట్ వనరులు ఉన్నాయి. పాటశాలలు, సమూహములు, మరియు వ్యక్తులు ఆన్లైన్ లో మరియు అధ్యయనము చేయు సమాజములలో ఉపయోగించుటకు అనుగుణంగా ఇవి రూపొందించబడినవి.

అనేక సంవత్సరాలుగా, అవార్డులు సంపాదించిన అత్యుత్తమమైన విషయములు మరియు నాణ్యతగల మల్టీమీడియా పాఠములను ఉత్పత్తి చేయుటకు తగుమాత్రపు ఖర్చుతో కూడిన పద్ధతిని మేము అభివృద్ధి చేశాము. మా రచయితలు మరియు సంపాదకులు వేదాంతవిద్యలో తర్ఫీదు పొందిన విద్యావేత్తలు, మా అనువాదకులు వేదాంత ప్రావీణ్యతకలిగి తాము అనువదించు భాషలలో మాతృభాషా నైపుణ్యత కలిగియున్నవారు, మరియు మా పాఠములు లోకవ్యాప్తముగా అనేక సెమినారీలలో బోధించు వందలమంది గౌరవనీయులైన అధ్యాపకులు మరియు కాపరుల యొక్క మెళకువలను కలిగియున్నాయి. ఇంతేగాక, మా గ్రాఫిక్ డిజైనర్లు, ఉదాహరణలను ఇచ్చువారు, మరియు ప్రొడ్యుసర్లు అద్భుతమైన పరికరములను మరియు టెక్నిక్లను ఉపయోగించి ఉన్నతమైన ప్రమాణములతో పనిచేస్తారు.

మా డిస్ట్రిబ్యూషన్ లక్ష్యములను చేధించుటకు, సంఘములతో, సెమినారీలతో, బైబిల్ కళాశాలలతో, మిషనరీలతో, క్రైస్తవ బ్రాడ్కాస్టర్లతో, శాటిలైట్ టెలివిజన్ వారితో, మరియు ఇతర సంస్థలతో థర్డ్ మిలీనియం వ్యూహాత్మక భాగస్వామ్యములను కలిగియున్నది. ఈ భాగస్వామ్యములు ఇప్పటికే లెక్కలేనన్ని వీడియో పాఠములను స్థానిక నయాకులు, కాపరులు, మరియు సెమినరీ విద్యార్థులకు పంచుటకు

కారణమైయ్యాయి. మా వెబ్సైటులు కూడా డిస్ట్రిబ్యూషన్ కు మాధ్యమాలుగా ఉండి, మా పాఠములతో పాటుగా సహాయకరముగా ఉండుటకు అదనపు వనరులను కూడా అందించుచున్నవి. ఉదాహరణకు, మీ సొంత అధ్యయన సమాజమును ఆరంభించుటను గూర్చిన వనరులు.

థర్డ్ మిలీనియం IRS 501(c)(3) కార్పోరేషన్ గా గుర్తింపుపొందినది. మేము సంఘములు, సంస్థలు, వ్యాపారములు, మరియు ప్రజలు వ్యక్తిగతంగా ఇచ్చు టాక్స్-మినహాయింపైన కానుకల మీద ఆధారపడి పనిచేస్తాము. మా పరిచర్యలను గూర్చి అదనపు సమాచారము కొరకు మరియు మీరు మాతో కలసి పరిచర్య చేయు మార్గములను తెలుసుకొనుటకు, ఈ వెబ్సైటును దర్శించండి http://thirdmill.org.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

# విషయ సూచిక


ఉపోద్ఘాతము ........ 1

నిర్వచనములు ........ 1

**సాధారణ నిర్వచనములు ........ 2**

థామస్ అక్వినాస్ ........ 2

చార్లెస్ హాడ్జ్ ........ 3

విలియం అమెస్ ........ 4

జాన్ ఫ్రేమ్ ........ 5

**ధోరణులు ........ 5**

అధ్యయన అవగాహన ........ 5

జీవన అవగాహన ........ 6

**విశ్లేషణలు ........ 7**

అధ్యయన అవగాహన ........ 7

జీవన అవగాహన ........ 9

లక్ష్యములు ........ 10

**ప్రాథమిక లక్ష్యములు ........ 11**

సాంప్రదాయకత ........ 11

సుప్రవర్తన లేక ఆర్థోప్రాక్సిస్ ........ 13

ఆర్థోపాథోస్ ........ 14

**పరస్పరాధారితము ........ 16**

సాంప్రదాయకత ........ 16

సుప్రవర్తన లేక ఆర్థోప్రాక్సిస్ ........ 17

ఆర్థోపాథోస్ ........ 18

**ప్రాధాన్యతలు ........ 19**

అంశములు ........ 21

**వికల్పములు ........ 21**

**ఎంపికలు ........ 22**

ముగింపు ........ 24





వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

# మీ వేదాంతశాస్త్రమును కట్టుట

మొదటి పాఠము

వేదాంతశాస్త్రము అంటే ఏమిటి?

## ఉపోద్ఘాతము

ఎలాంటి గమ్యము లేక మనస్సులో ఒక ప్రణాళిక లేకుండా సరదాగా నడచుట కొన్ని సార్లు మంచిది అని నేననుకుంటాను. గమ్యము లేకుండా అటు ఇటు తిరుగుట ఎంతో ఆహ్లాదమును ఇస్తుంది, కాని ఒక ప్రత్యేకమైన ఉద్దేశము ఉన్నప్పుడు, ఒక సమయమందు ఒక స్థలముకు చేరవలసియున్నప్పుడు, ఒక పటము, ఒక ప్రణాళిక, లేక ఒక మార్గమును గూర్చిన అవగాహన ఉండుట చాలా మంచిది.

ఈ పాఠముల యొక్క గుంపుకు మీ వేదాంతశాస్త్రమును కట్టుట అని పేరు పెట్టాము. వేదాంత శాస్త్రమును నిర్మించునప్పుడు స్థిరమైన జవాబులు పొందుట చాలా అవసరము కాబట్టి, ఆ లక్ష్యమును అందుకొనుటకు మనము ఒక ప్రణాళిక కలిగియుండాలి. కాబట్టి, ఈ పాఠముల గుంపులో, ఒక బాధ్యతాయుతమైన క్రైస్తవ వేదాంతశాస్త్రమును నిర్మించుటకు కొన్ని సాధారణమైన మరియు ముఖ్యమైన నిర్దేశములను మనము పరిశీలన చేద్దాము.

మొదటి పాఠమునకు “వేదాంతశాస్త్రము అంటే ఏమిటి?” అనే పేరు పెట్టాము మరియు ఈ ప్రశ్నకు మన జవాబు గతంలో సంఘమునకు ఉపయోగపడిన మరియు నేడు మనము పాటించవలసిన వేదాంతశాస్త్ర అధ్యయన ప్రణాళికను సూచిస్తుంది. ఈ ప్రణాళికను విపులపరచుటకు, మన పాఠం మూడు ముఖ్య భాగములుగ విభజింపబడుతుంది: మొదటిగా, వేదాంతశాస్త్రము యొక్క నిర్వచనమును మనము చూద్దాము; రెండవదిగా, వేదాంతశాస్త్రము యొక్క లక్ష్యములను చూద్దాము; మరియు మూడవదిగా, వేదాంతశాస్త్రములోని కొన్ని అంశములను చూద్దాము. “వేదాంతశాస్త్రము” అను పదము యొక్క నిర్వచనమును ఇస్తూ ఆరంభించుదాము.

ఈ అంశము యొక్క విచారణలో, మనము మూడు విషయములను చూస్తాము: మొదటిది, నాలుగురు వేదాంతశాస్త్రవేత్తలు ఇచ్చిన కొన్ని సాధారణ నిర్వచనములను చూద్దాము; రెండవదిగా, ఈ నిర్వచనముల యొక్క కొన్ని ధోరణులను లేక దృష్టికోణాలను వివరించుదాము; మరియు మూడవదిగా, ఈ పలు ధోరణులను మనము విశ్లేషణ చేద్దాము. ముందుగా కొందరు వేదాంతశాస్త్రవేత్తలు వేదాంతశాస్త్రమును నిర్వచించిన కొన్ని విధములను చూద్దాము.

## నిర్వచనములు

ఇప్పుడు, రోమా. 1వ అధ్యాయములో, మానవులందరు తమ జీవిత కాలములంతా వేదాంతశాస్త్రమును అనుసరించు ఒక ప్రాముఖ్యమైన అవగాహన ఇవ్వబడింది. అవిశ్వాసులు కూడా కొన్ని సార్లు ఏదో ఒక విధంగా దేవుని గూర్చి మరియు ఆయన షరతులను గూర్చి ఆలోచన చేయుటకు, కొన్నిసార్లు వారికి తెలియకుండానే కావచ్చు, ఒక సామాన్య ప్రత్యక్షతను ఎదుర్కొంటారు. మరియు



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు అనేక ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

విశ్వాసులు, వారు ఏ వృత్తిలో ఉన్నాగాని, ఎక్కువ సమయం దేవుని గూర్చిన ఆలోచనలతో సమయం గడుపుతారు. అయినను, మన అధ్యయనమును ఆరంభించుచుండగా, వేదాంతశాస్త్రమును మరింత పద్ధతి ప్రకారమైన కార్యముగా పరిగణించుదాము, అనగా ఒక ప్రత్యేకించబడిన విషయము మీద తగిన అవగాహన మరియు జ్ఞానము కలిగిన ప్రజలు చేయు కృషిగా పరిగణిద్దాము.

## సాధారణ నిర్వచనములు

వేదాంతశాస్త్రము అనే సాధారణ అంశమును క్రైస్తవులు మరియు క్రైస్తవులు కానివారు లెక్కలేనన్ని విధములుగా నిర్వచించారు. కాని వేదాంతశాస్త్రము యొక్క పద్ధతిప్రకారమైన చర్చను మనము ఆరంభించుచుండగా, కొన్ని ఉపయోగకరమైన ఆలోచనలను ఇచ్చిన నలుగురు గౌరవనీయులైన వేదాంతశాస్త్రవేత్తల మీద మన దృష్టిని పరిమితము చేద్దాము. థామస్ అక్వినాస్, చార్లెస్ హాడ్జ్, విలియం అమెస్ మరియు సమకాలీన వేదాంతశాస్త్రవేత్త జాన్ ఫ్రేమ్ యొక్క రచనలలో మనము పొందు నిర్వచనములను పరిశీలన చేద్దాము.

### థామస్ అక్వినాస్

మొదటిగా, ప్రఖ్యాతిగాంచిన రోమన్ కాథలిక్ వేదాంతశాస్త్రవేత్తయైన థామస్ అక్వినాస్ వేదాంతశాస్త్రమును గూర్చిన ఒక సాంప్రదాయకమైన నిర్వచనమునకు ప్రాతినిథ్యం వహిస్తాడు. ఆయన ఆలోచనలు ఆయన కంటే ముందు వచ్చిన వేదాంతశాస్త్రవేత్తల అభ్యాసములలో నుండి పుట్టాయి, మరియు నేటికి అవి సంఘములోని అనేక శాఖల మీద ప్రభావం చూపుతాయి. ఆయన సుపరిచిత పుస్తకమైన సుమ్మ థియోలజికలోని మొదటి పుస్తకము, మొదటి అధ్యాయం, ఏడవ భాగంలో అక్వినాస్ వేదాంతశాస్త్రమును "పవిత్రమైన సిద్ధాంతము" అని పిలచి ఈ విధంగా నిర్వచించాడు:

> అవి స్వయంగా దేవుడైయుండుట వలన లేక అవి దేవుని సంభోదించుచున్నందు వలన, అన్ని విషయములు దేవుని దృష్టిలో నుండి విచారించబడు ఒక ఏకీకృత విజ్ఞానము.

ఈ నిర్వచనము వేదాంతశాస్త్ర విద్యార్థులకు చాలా సులువైనదిగా ఉన్నది మరియు మనలో చాలా మంది దీనిని అర్థము చేసుకొనవచ్చు. దీనిలో మనము చర్చించవలసిన రెండు ముఖ్యమైన కోణములు ఉన్నాయి.

మొదటిగా, అక్వినాస్ వేదాంతశాస్త్రమును ఒక "విజ్ఞానము"గా నిర్వచించాడు. అయితే, ఇక్కడ "విజ్ఞానము" అనే పదమునకు ఆధునిక అర్థము వర్తించదుగాని, ఇక్కడ విజ్ఞానము అంటే విశాలమైన అవగాహనతో చేయు జ్ఞానముతో కూడిన లేక పాండిత్య అన్వేషణ. ఈ ఆలోచన ప్రకారంగా, వేదాంతశాస్త్రము ఒక విశేషమైన లక్ష్యము కలిగిన ఒక విద్యా విధానము. కొందరు జీవశాస్త్రము, మనోవిజ్ఞాన శాస్త్రము, న్యాయ శాస్త్రము లేక చరిత్రను అధ్యయనం చేయునట్లే, కొందరు ప్రజలు వేదాంతశాస్త్రమును ఒక విద్యా విధానముగా అధ్యయనము చేస్తారని అక్వినాస్ యొక్క నిర్వచనము సూచిస్తుంది. వేదాంతశాస్త్రము అనే అంశము విద్యా అధ్యయనముతో ముడిపడియున్న పలు రకముల ఆలోచనలు మరియు కార్యక్రమముల ద్వారా ప్రాథమికంగా నేరవేర్చబడుతుంది.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

ఈ ఆలోచనలో, వేదాంతశాస్త్రమును గూర్చిన సిద్ధాంతములు లేక ఆలోచనలను గూర్చి బోధించుట లేక వ్రాయుట ఒక వేదాంతశాస్త్రవేత్త యొక్క ముఖ్యమైన పని. అయితే, వేదాంతశాస్త్రము కేవలం ఒక విద్యా విధానముగా మాత్రమే ఉండాలని అక్వినాస్ నమ్మలేదు; కాని వేదాంతశాస్త్రము క్రైస్తవ జీవితములోని ప్రతి కోణము మీద ప్రభావం చూపాలి. అయితే, వేదాంతశాస్త్రము ప్రాథమికంగా ఒక పాండిత్య అన్వేషణ అనే అవగాహనను ఆయన ఆలోచన ఇస్తుంది.

మనము అక్వినాస్ యొక్క వేదాంతశాస్త్ర నిర్వచనమును చూస్తుండగా, దానిలో రెండవ ప్రాముఖ్యమైన కోణమును కూడా చూద్దాము. అక్వినాస్ యొక్క ఆలోచన ప్రకారం, వేదాంతశాస్త్రములో రెండు స్థాయిలు ఉన్నాయి. ఒకవైపు, వేదాంతశాస్త్రవేత్తలు "స్వయంగా దేవుని" గూర్చిన విషయాలను అన్వేషిస్తారు. ఉదాహరణకు, దేవుని యొక్క గుణములు వంటి అంశములను గూర్చి మనము కొన్ని ఆలోచనలను రూపిస్తాము: ఆయన సర్వజ్ఞత, ఆయన సర్వవ్యాపియత, ఆయన పరిశుద్ధత. ఈ అధ్యయన అంశములను మనము "దేవుని గూర్చిన శాస్త్రము లేక థియోలజి ప్రొపర్" అని పిలుస్తాము. ఇక్కడ మన అధ్యయనము యొక్క అంశము స్వయంగా దేవుడైయున్నాడు.

మరొక వైపు, అక్వినాస ఉపయోగించిన విధంగా, దేవునికి సంబంధించిన లేక దేవునిని సంబోధించుచున్న మరి ఏ ఇతర అంశము యొక్క అధ్యయనము కూడా వేదాంతశాస్త్రమైయున్నది. ఈ అంశములను దేవుని యొక్క ఎలాంటి ప్రస్తావనా లేకుండా కూడా చర్చించవచ్చు, కాని వేదాంతశాస్త్రవేత్తలు ఈ అంశములను దేవునితో అనుబంధించుట ద్వారా తమ నైపుణ్యతను ఉపయోగిస్తారు. ఉదాహరణకు, రాకడశాస్త్రము, అనగా అంత్యదినములలో జరుగు విషయములను గూర్చి చేయు అధ్యయనము, వేదాంతశాస్త్రములో ఒక ముఖ్యమైన అంశము. పాపము, విమోచన సిద్ధాంతములు మరియు ప్రభువు బల్లలో క్రీస్తు యొక్క సన్నిధి వంటి అంశములు కూడా దేవుని గూర్చిన శాస్త్రము కానప్పటికీ వాటిని వేదాంతశాస్త్రములో భాగముగా పరిగణించవచ్చు.

అక్వినాస స్థాపించిన ఈ సామాన్య అవగాహన ఆధారంగా, ప్రొటెస్టెంట్ వేదాంతశాస్త్రవేత్తయైన చార్లెస్ హాడ్జ్ చెప్పిన సమరూప విషయములు వినుట మంచిది.

## చార్లెస్ హాడ్జ్

ప్రొటెస్టెంట్ పునరుద్ధరణ క్రీస్తు శరీరములో పలు మార్పులను తెచ్చినప్పటికీ, వేదాంతశాస్త్రము యొక్క నిర్వచనము మీద అది గొప్ప ప్రభావం చూపలేదు. 1797 నుండి 1879 మధ్య నివసించిన, ప్రిన్స్ టౌన్ కు చెందిన చార్లెస్ హాడ్జ్, ఆయన వ్రాసిన సిస్టమాటిక్ థియోలాజి యొక్క మొదటి అధ్యాయంలో వేదాంతశాస్త్రమును ఈ విధంగా నిర్వచించాడు. వేదాంతశాస్త్రము అనగా "దేవుని స్వభావమును గూర్చి మరియు దానితో మన అనుబంధమును గూర్చి సత్యములను తెలుపు దేవుని ప్రత్యక్షతలోని వాస్తవముల యొక్క విజ్ఞానము."

వేదాంతశాస్త్రమును గూర్చిన ఈ నిర్వచనములోని పలు కోణములను చూద్దాము. మొదటిగా, హాడ్జ్ యొక్క నిర్వచనము అక్వినాస్ యొక్క నిర్వచనమును పోలియున్నదిగాని, ఆయన ప్రత్యక్షతను గూర్చి ఎంత స్పష్టంగా ప్రస్తావించాడో మనము గమనించాలి. వేదాంతశాస్త్రము "దేవుని ప్రత్యక్షతలోని వాస్తవములను" గూర్చి మాట్లాడుతుంది. ఇప్పుడు, అక్వినాస్ కూడా దేవుని ప్రత్యక్షత మీద ఆధారపడటానికి ప్రయత్నించాడు, కాని హాడ్జ్ యొక్క నిర్వచనము ఒక నిజమైన ప్రొటెస్టెంట్ ఆలోచనను



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

బయలుపరుస్తుంది, అది వేదాంతశాస్త్రము యొక్క ముఖ్యమైన నిధిగా దేవుని ప్రత్యక్షత, ముఖ్యముగా బైబిలు, యొక్క ప్రాముఖ్యతను వక్కాణిస్తుంది.

రెండవదిగా, అక్వినాస్ వలెనే హాడ్జ్ కూడా వేదాంతశాస్త్రమును ఒక "విజ్ఞానముగా" పరిగణించాడు అని గుర్తించుట చాలా ప్రాముఖ్యమైయున్నది — ఆయన వేదాంతశాస్త్రమును ఒక అధ్యయన అంశముగా చూసాడు. వాస్తవానికి, ఆయన కాలములోని వేదాంతశాస్త్రవేత్తలు వేదాంతశాస్త్రము కొరకు ప్రకృతి శాస్త్రము లేక భౌతిక శాస్త్రములోని పద్ధతులను ఒక నమూనాగా ఉపయోగించాలని హాడ్జ్ కోరాడు. ఆయన రచించిన సిస్టమాటిక్ థియోలజిలోని మొదటి పేజీలో ఆయన వ్రాసిన మాటలను వినండి:

> ప్రకృతి ఎంతగా ఒక రసాయనశాస్త్రము లేక యాంత్రికశాస్త్రములో ఒక వ్యవస్థగా ఉన్నదో బైబిలు కూడా వేదాంతశాస్త్రములో వ్యవస్థగా ఉన్నది. రసాయనశాస్త్రవేత్త లేక ఒక యాంత్రిక తత్వవేత్త పరీక్షించవలసిన వాస్తవాలను మనము ప్రకృతిలో కనుగొంటాము . . . అవి పని చేయు నియమాలను నిర్ధారించుట కొరకు. అలాగే ఒక వేదాంతశాస్త్రవేత్త సేకరించి, నిర్ధారించి, అమర్చి, వాటిని దానిలోని పరస్పర అనుబంధములో కనుపరచు సత్యములను వేదాంతవేత్త బైబిలులో పొందుతాడు.

శతాబ్దపు ఇతర విజ్ఞానవేత్తల వలెనె బైబిలును ఒక డేటాగా ఉపయోగించి, పరిశోధన చేసి, పరీక్షించి, ఇతర విద్యా విషయములలో 19వ దానిని క్రమపరచుట ఒక వేదాంతశాస్త్రవేత్త యొక్క పని అని హాడ్జ్ యొక్క ఆలోచన. ఇప్పుడు, వేదాంతశాస్త్రవేత్తల యొక్క పరిశోధనా ఫలితాలను క్రైస్తవ జీవనములోను అన్వయించాలని ఆయన నమ్మాడు, కాని అక్వినాస్ వలెనె, అన్వయించు పనిని హాడ్జ్ సేవకులు మరియు కాపరుల చేతికి విడిచిపెట్టి, క్రమబద్ధమైన వేదాంతశాస్త్రము యొక్క పనిని ముఖ్యంగా విద్యావేత్తలు మరియు విద్యార్థుల చేతికి అప్పగించాడు.

మూడవదిగా, వేదంతశాస్త్రములో రెండు ముఖ్యమైన అంశములు ఉన్నాయని హాడ్జ్ దావా చేసాడు. వేదాంతశాస్త్రములో మన ముఖ్య ధ్యాస "దేవుని స్వభావము" మరియు "ఆయనతో మన అనుబంధము" మీద ఎక్కువగా ఉంటుంది. వేదంతశాస్త్రములోని ఈ విభజన అక్వినాస్ యొక్క నిర్వచనమును పోలియున్నది, అనగా దేవుని గూర్చిన శాస్త్రము మరియు సామాన్య వేదాంతశాస్త్రము మధ్య వ్యత్యాసము చూపుట.

అక్వినాస్ మరియు హాడ్జ్ ఇచ్చిన వేదాంతశాస్త్ర నిర్వచనములను చూసిన తరువాత, మూడవ నిర్వచనమును కూడా చూచుట మనకు ఉపయోగపడుతుంది. 1576 నుండి 1633 మధ్య జీవించిన ప్రఖ్యాతిగాంచిన ప్యూరిటన్ విలియం అమెస్, వేదాంతశాస్త్రమును గూర్చి కొంత భిన్నముగా మాట్లాడాడు.

## విలియం అమెస్

ఆయన రచించిన పుస్తకమైన మారో అఫ్ థియోలజి లోని మొదటి భాగంలో, వేదాంతశాస్త్రము యొక్క కేంద్రము "దేవుని కొరకు జీవించుట అను బోధ లేక సిద్ధాంతము" అని చెప్పాడు.

వేదాంతశాస్త్రమును గూర్చి అమెస్ యొక్క అవగాహన ఇప్పటి వరకు మనము చూసిన రెండు విధానములకు భిన్నముగా ఉన్నది. మొదటిగా, ఆయన నిర్వచనము "విజ్ఞానము" అనే పదమును ఉపయోగించదు. వేదాంతశాస్త్రము ఒక "సిద్ధాంతము లేక బోధ," అనగా వేదాంతశాస్త్రము అనేది ఆలోచనలు లేక బోధనలను జ్ఞానముతో అన్వేషించుట, అని అమెస్ చెప్పాడు. కాని అక్వినాస్ మరియు



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

హాడ్జ్ యొక్క భాషలో సూచించినట్లు ఇతర విద్యా విషయములతో వేదాంతశాస్త్రము యొక్క దగ్గర సంబంధమును ఆయన వక్కాణించలేదు.

రెండవదిగా, వేదాంతశాస్త్రము సిద్ధాంతమును గూర్చిన అధ్యయనము అని అమెస్ చెప్పినప్పటికీ, దానిలోని అధ్యయన అంశము ఏమైయున్నదని ఆయన చెప్పాడో ఒక సారి గమనించండి: "దేవుని కొరకు జీవించుట." అక్వినాస్, మరియు కొంత వరకు హాడ్జ్, వేదాంతశాస్త్రము అంటే వాస్తవములు లేక ఆలోచనల యొక్క సేకరణ అనే విషయము మీద దృష్టిపెట్టారు కాని, అమెస్ మాత్రం వేదాంతశాస్త్రములో ఒకడు దేవునిలో మరియు దేవుని కొరకు జీవించుట ముడిపడియున్నదని వక్కాణించాడు. వేదాంతశాస్త్రమును కేవలం ఒక జ్ఞానపూర్వకమైన, వాస్తవముల అన్వేషణకు మాత్రమే పరిమితము చేయకుండా, అమెస్ విశ్వాసి జీవితము యొక్క విశాలమైన అవగాహన వైపు ఒక పరిశోధనా (దీనిని ప్యూరిటన్లు "పరిశోధనాత్మక" అని పిలుస్తారు) దృష్టితో చూసాడు. ఆయన ఆలోచన ప్రకారంగా, వేదాంతశాస్త్రము, వేదాంతశాస్త్రము యొక్క మూలుగ, ఈ విశాల ఆలోచనను దృష్టిలో ఉంచుకొని చేయాలి.

సమకాలీన వేదాంతశాస్త్రవేత్తయైన జాన్ ఫ్రేమ్ అమెస్ కోవకు చెందినవాడే.

### జాన్ ఫ్రేమ్

ఆయన పుస్తకము, ది డొక్ట్రిన్ అఫ్ ది నాలెడ్జ్ అఫ్ గాడ్, యొక్క మూడవ అధ్యాయములో ఫ్రేమ్ వేదాంతశాస్త్రమును "ప్రజలు దేవుని వాక్యమును తమ జీవితములోని అన్ని కోణములకు అన్వయించుకొనుట" అని నిర్వచించాడు.

ఫ్రేమ్ కొంత వరకు అక్వినాస్ మరియు హాడ్జ్ యొక్క ఆలోచనలతో సమ్మతిస్తాడు, ఎందుకంటే మరొకచోట ఆయన "అన్వయము"ను "బోధ" లేక "సిద్ధాంతము" అని నిర్వచించాడు. అయినను, వేరొకచోట ఆయన చెప్పినట్లు, ఫ్రేమ్ ప్రకారం, బోధ అనేది "ప్రజల యొక్క అవసరతల కొరకు" లేఖనమును ఉపయోగించు ప్రక్రియ. వేదాంతశాస్త్రము అనగా కొన్ని సాంప్రదాయిక అధ్యయన సమస్యలను గూర్చి ఆలోచించుట మాత్రమే కాదు. కాని, వేదాంతశాస్త్రము అంటే అన్వయము; అది లేఖన బోధనలను జీవితములోని విశాలమైన అంశములకు అన్వయించుట.

ఇప్పటి వరకు మనము వేదాంతశాస్త్రమునకు నాలుగు వేర్వేరు నిర్వచనములను చూశాము కాబట్టి, అవి ప్రాతినిధ్యము వహించు ఆలోచనలు లేక ధోరణులను పోల్చుటకు అవి మనకు సహాయకరంగా ఉంటాయి.

## ధోరణులు

ఈ నాలుగు నిర్వచనములు ఈ అంశము మీద వేదాంతశాస్త్రవేత్తలు తీసుకొన్న రెండు విలువైన ధోరణులను బయలుపరుస్తాయి. వీటిలో మొదటి ధోరణిని మనము అధ్యయన అవగాహన మరియు రెండవ దానిని జీవన అవగాహన అని పిలువవచ్చు.

### అధ్యయన అవగాహన

ఒక వైపు, అక్వినాస్ మరియు హాడ్జ్ వేదాంతశాస్త్రములో అధ్యయన అవగాహనకు ప్రతినిధులు. వారి ఆలోచన ఎక్కువ మంది క్రైస్తవ వేదాంతశాస్త్రవేత్తలు వేదాంతశాస్త్రమును నిర్వచించిన విధానములకు

ప్రాతినిధ్యం వహిస్తుంది. సులువైన మాటలలో, వారు "వేదాంతశాస్త్రము"ను "వేదాంతశాస్త్రము" అనే పదము యొక్క శబ్దలక్షణము, లేక భాషా సందర్భమును దృష్టిలో ఉంచుకొని నిర్వచిస్తారు. గ్రీకు పదమైన థియోస్ యొక్క అర్థము దేవుడు, మరియు ఇది "థియోలజి" అనే పదములోని మొదటి సగమును కలిగియున్నది. మరియు ఈ సందర్భములో, గ్రీకు పదమైన లోగోస్ యొక్క అర్థము ఒక విషయమును గూర్చిన "విజ్ఞానము, లేక సిద్ధాంతము లేక అధ్యయనము," మరియు ఇది "థియోలజి" అనే పదములో రెండవ భాగమును కలిగియున్నది. కాబట్టి, శబ్దలక్షణ ఆధారంగా, "థియోలజి" అనే పదమునకు అర్థము "దేవుని గూర్చిన సిద్ధాంతము లేక అధ్యయనము"

అయితే, దేవుని గూర్చి చదువుట మాత్రమే అంతము అని చెప్పే నిజాయితీ గల ఒక్క ఇవాంజెలికల్ వేదాంతశాస్త్రవేత్త కూడా ఉండడు. వేదాంతశాస్త్రమును ఒక విధంగానో లేక వేరొక విధంగానో తమ జీవితాలకు అన్వయించుకోవాలని చాలా మంది విశ్వాసులు కోరతారు. అయితే ఒక క్రమబద్ధమైన వేదాంతశాస్త్రములో అన్వయము అనే దానిని ప్రాముఖ్యమైన భాగముగా సాధారణంగా పరిగణించరు, కాని రెండవ మెట్టుగా పరిగణిస్తారు, దీనిని కొన్ని సార్లు అభ్యాసిక వేదాంతశాస్త్రము అంటారు, అనగా క్రమబద్ధమైన వేదాంతశాస్త్రములో అధ్యయన, పాండిత్య సంబంధమైన సమస్యలను నిర్ధారించుకున్న తరువాత మనము పాలుపంచుకొను రెండవ విషయము.

ఇందు వలన, చాలా సార్లు క్రమబద్ధమైన వేదాంతశాస్త్రమును సామాన్య జీవితముతో ఎలాంటి సంబంధం లేకుండా పాటించవచ్చు. అనగా ఇది కేవలం అధ్యయనములో వరములు పొందిన కొందరు మాత్రమే ఎక్కువగా పాలుపంచుకొను ఒక విషయముగా మిగిలిపోతుంది. వేదాంతశాస్త్రములో ఒక విధమైన జ్ఞాన నైపుణ్య ప్రవృత్తి నెలకొంటుంది. మరొక వైపు, అమెస్ మరియు ఫ్రేమ్ చెప్పిన దానిలో మనము చూసిన నిర్వచనములు ఒక ముఖ్యమైన అల్పసంఖ్యక ఆలోచన, అనగా వేదాంతశాస్త్రమును జీవితమునకు అన్వయించుటకు ప్రాతినిధ్యం వహిస్తాయి.

### జీవన అవగాహన

వేదాంతశాస్త్రము ఒక విశ్వాసి జీవనము యొక్క విశాలమైన అంశములతో ఎంతో గాఢముగా ముడిపడియున్నది అని ఆలోచించు వేదాంతశాస్త్రవేత్తలు కూడా ఎల్లప్పుడూ ఉన్నారు, కాని వెనుకటి కాలములో, చాలా తక్కువ మంది పేరుగాంచిన వేదాంతశాస్త్రవేత్తలు ఈ అవగాహనను కలిగియుండేవారు. ఈ మధ్య కాలంలో, వేదాంతశాస్త్రము అనేది కేవలం జ్ఞానులు మాత్రమే ఆలోచించవలసిన విషయము అనే ఆలోచనను ఎక్కువ మంది వేదాంతశాస్త్రవేత్తలు తిరస్కరించుట ఆరంభించారు. వారు క్రమబద్ధమైన వేదాంతశాస్త్రమును క్రైస్తవ జీవనము కొరకు కేవలం జ్ఞానము లేక అధ్యయన ఆధారముగా చూడలేదుగాని, క్రీస్తు కొరకు జీవించుటను గూర్చి ముఖ్యముగాను లోతుగాను ఆశ గల ఒక అంశముగా చూశారు.

ఈ అల్పసంఖ్యక ఆలోచనకు ఈ మధ్య కాలంలో ఎక్కువ మంది సమర్థకులు ఉండుటకు చాలా కారణాలు ఉన్నాయి. కొన్ని కారణములు వేదాంతశాస్త్రములో నుండి మరియు లేఖనములలో నుండి కూడా వెలువడుతున్నాయి. కాని ఎదుగుచున్న ఈ ఆలోచనలలో కొన్ని ప్రవీణుల నిష్పక్షపాతమును సరిగానే ప్రశ్నించు, వారు ఏ రంగమునకు చెందినవారైనా సరే, పాశ్చాత్య సంస్కృతులలోని కొన్ని ఆలోచనలలో నుండి ఎదుగుచున్నాయని మనము గుర్తుంచుకోవాలి. ప్రవీణుల యొక్క మానవత్వము

మరియు వారి జీవితము వారి అధ్యయనములను ఎలా ప్రభావితము చేయుచున్నాయో ఈ రోజులలో మనకు ఎక్కువగా జ్ఞాపకము చేయబడుతుంది.

ఉదాహరణకు, ఒకప్పుడు నిష్పక్షపాతంగా స్పష్టమైన ఆలోచనలు చెప్పువారిగా పరిగణించబడిన విజ్ఞానవేత్తలు మరియు వైద్య రంగమువారు, నేడు సాధారణ ప్రజలుగా పరిగణించబడుతున్నారు. కొన్ని దశాబ్దాల క్రితం ఎన్నడు ఊహించని విధంగా వారి అభిప్రాయాలను మనము తరచుగా ప్రశ్నిస్తాము. అదే విధంగా, వేదాంతశాస్త్రవేత్తలు ఎంత గొప్ప నైపుణ్యము గలవారైనా, వారు కూడా మానవమాత్రులే అని సంఘము మరింత స్పష్టముగా గుర్తిస్తుంది. వారు వాస్తవాలను ఎంత నిష్పక్షపాతంగా గమనించుచున్నామని చెబుతున్నా, వారి అభిప్రాయలు తమ తమ జీవిత అనుభవాల మీద ఆధారపడియుంటాయి. అందువలన, వేదాంతశాస్త్రమును కేవలం అధ్యయన విధానాలలో చూచుటకు నేడు తక్కువ విలువ ఉన్నది, మరియు అన్వయము యొక్క అవసరతను మునుపటి కంటే స్పష్టముగా చూస్తున్నారు.

అధ్యయన మరియు జీవన అవగాహనల యొక్క ఆకృతలను దృష్టిలో ఉంచుకొని, మనము ఒక నిమిషం ఆగి కొన్ని ప్రాథమిక విశ్లేషణలను చేపట్టాలి.

## విశ్లేషణలు

ప్రతి ధోరణిలో లాభములు మరియు నష్టములను గూర్చి అడుగుట ఉపయోగకరంగా ఉంటుంది. ఒక క్రమబద్ధమైన, గంభీరమైన వేదాంతశాస్త్రములో అధ్యయన అవగాహన యొక్క అనుకూలతలు మరియు ప్రతికూలతలు ఏమిటి?

### అధ్యయన అవగాహన

మొదటిగా, అధ్యయన పద్ధతి యొక్క గొప్ప బలము ఏమిటంటే అది మానవులకు దేవుడు కృపతో ఇచ్చిన వరమును ఉపయోగిస్తుంది: మన హేతుబద్ధ సామర్ధ్యములు. దేవుడు మానవులకు జ్ఞాన శక్తిని ఇచ్చాడు, మరియు సత్యాన్వేషణలో వేదాంతవేత్తలు ఆ సామర్ధ్యమును ఉపయోగించాలని దేవుడు కోరుచున్నాడు.

దేవుని భయముతో తమ జ్ఞాన శక్తిని ఉపయోగించిన జ్ఞానులు లేఖనమంతటిలో కొనియాడబడిరి. సత్యము యొక్క స్వభావమును గూర్చి జాగ్రత్తగా ఆలోచన చేసి ఆ హేతుబద్ధమైన విచారణలలో నుండి నమ్మకములను రూపుదిద్దుట ఒక జ్ఞానిగా ఉండుటలో ముఖ్యమైన భాగము. సొలొమోను తాను కలిగియున్న శక్తిని సదరు విషయములన్నిటిలో ఉపయోగించాడు కాబట్టి జ్ఞాని అయ్యాడు.

1 రాజులు 4:29 మరియు 31లో సొలొమోనును గూర్చిన వర్ణనను వినండి.

> దేవుడు జ్ఞానమును బుద్ధిని వర్ణింప శక్యము కాని వివేచనగల మనస్సును సొలొమోనునకు దయచేసెను . . . అతడు సమస్తమైన వారికంటెను, . . . జ్ఞానవంతుడైయుండెను గనుక అతని కీర్తి చుట్టునున్న జనములన్నిటిలో వ్యాపితమాయెను (1 రాజులు 4:29, 31).

దీని ఆధారంగా, బైబిలులోని జ్ఞాన రచనలు మనకు ఇవ్వబడిన జ్ఞాన సామర్థ్యమును అభివృద్ధి చేసి ఉపయోగించాలని ప్రోత్సహిస్తున్నాయి.

వాస్తవానికి, పౌలు యొక్క వేదాంతశాస్త్రము జ్ఞానులకు మాత్రమే అర్థమవుతుంది అని తెలిపి పేతురు పౌలును కొనియాడాడు. 2 పేతురు 3:15-16లో ఆయన అంటాడు:

> **. . . మన ప్రియ సహోదరుడైన పౌలుకూడ తనకు అనుగ్రహింపబడిన జ్ఞానము చొప్పున మీకు వ్రాసియున్నాడు. . . వీటిని విద్యావిహీనులును, అస్థిరులైనవారును, . . . అపార్థము చేయుదురు (2 పేతురు 3:15-16).**

సాంప్రదాయక వేదాంతశాస్త్రము యొక్క జ్ఞానపూర్వక లేక అధ్యయన వక్కాణము మంచి వేదాంతశాస్త్రము అనే బైబిలు ఆలోచనకు వ్యతిరేకముగా లేదు. భిన్నంగా, బహుగా ఆలోచించుట సాంప్రదాయిక వేదాంతశాస్త్రము యొక్క గొప్ప బలమైయున్నది.

అయినను, వేదాంతశాస్త్రము మీద అధ్యయన దృష్టిలో అపాయము దాగియున్నదని మనము గ్రహించాలి. దురదృష్టవశాత్తు, సాంప్రదాయక వేదాంతశాస్త్రము చాలా సార్లు విషయపూర్వక లేక అధ్యయన సమస్యల వైపు మొగ్గుచూపుతుంది కాబట్టి వేదాంతశాస్త్రవేత్తల యొక్క గ్రంథాలయము వెలుపల జీవితముల మీద తక్కువ శ్రద్ధ పెట్టబడుతుంది. వాస్తవమైన ఆలోచనలను కనుగొనుట మాత్రమే ఒక గమ్యమైపోతుంది, ఎంతగా అంటే వారికి వేదాంతశాస్త్ర అంశములను గూర్చి ఎంతో జ్ఞానము ఉన్నది కాబట్టి వారిని మంచి వేదాంతశాస్త్రవేత్తలుగా పరిగణించుట సర్వసాధారణమైపోతుంది. కాని కొన్ని సార్లు "మంచి వేదాంతశాస్త్రవేత్తలు" "మంచి మనుష్యులు" కారని కూడా మనము ఒప్పుకోవాలి.

దురదృష్టవశాత్తు, ఈ వర్ణన అనేక మంది "మంచి వేదాంతశాస్త్రవేత్తలు" అని పిలువబడుతున్నవారికి వర్తిస్తుంది. వారు గొప్ప నైపుణ్యతతో దేవుని గూర్చి మరియు క్రైస్తవ జీవితమును గూర్చి సత్యములను సేకరించి పోగు చేయగలరుగాని, క్రైస్తవ విశ్వాస వెలుగులో జీవించుటకు అదే విధమైన ధ్యాసను ఇచ్చుటలో వారు విఫలమవుతారు.

ఒక వ్యక్తి మంచి వేదాంతశాస్త్రవేత్తేగాని మంచి మనిషి కాదు అని నమ్మే స్థాయికి మనము ఎలా చేరతాము? ఇది కేవలం అధ్యయనము లేక విద్యా కార్యకలాపాల ఆధారంగా వేదాంతశాస్త్రమునకు నిర్వచనమును ఇచ్చు ప్రయత్నం చేసినప్పుడు, అనగా వేదాంతశాస్త్రమును అనుసరించుట అంటే కేవలము మంచిగా చదువుట, మంచిగా వ్రాయుట, సత్య ఆలోచనలను బోధించుట మాత్రమే అని మనము ఆలోచించునప్పుడు మనము దీనిని గ్రహించగలము.

దురదృష్టవశాత్తు, నేటి క్రమబద్ధమైన వేదాంతశాస్త్ర విద్యా విధానములలో ఇదే తీరు కొనసాగుచున్నది. సువార్త పరిచారకులను సిద్ధపరచుటకు వేదాంత కళాశాలలు కేవలం క్లాసు రూమ్ అనుభవము మీద మాత్రమే ఆధారపడుట అనే సత్యము వేదాంతశాస్త్రమును జీవించకుండానే దానిని చాలా వరకు మనము రూపొందించవచ్చు అనే మన నమ్మకమును బయలుపరుస్తుంది. క్రమబద్ధమైన వేదాంతశాస్త్రము పట్ల సాంప్రదాయక పద్ధతిలో ఉన్న గొప్ప అపాయములలో ఇది ఒకటి.

అలాగే జీవన-అవగాహన వేదాంతశాస్త్రములో కూడా లాభములు నష్టములు ఉన్నాయని కూడా మనము గ్రహించాలి. వేదాంతశాస్త్రము అనేది అధ్యయనమునకు వెలుపల ఉన్న జీవితముతో మరింత సూటిగా ముడిపడియున్నది అనే ఎదుగుచున్న అవగాహనను మనము ఎలా విశ్లేషించగలము?

## జీవన అవగాహన

మొదటిగా, వేదాంతశాస్త్రము యొక్క ఈ పద్ధతి యొక్క గొప్ప బలము ఏమిటంటే, ఇది కొన్ని ముఖ్యమైన బైబిలు విలువలను గమనించుటకు మనలను ప్రోత్సహిస్తుంది. యాకోబు 1:22 వంటి లేఖనభాగములు మనకు తెలుసు. యాకోబు వ్రాస్తూ అంటాడు:

> మీరు వినువారు మాత్రమైయుండి మిమ్మును మీరు మోసపుచ్చుకొనకుండ, వాక్యప్రకారము ప్రవర్తించువారునైయుండుడి (యాకోబు 1:22).

కొందరు వేదాంతశాస్త్రవేత్తల యొక్క జ్ఞానపూర్వక వేషధారణను లేఖనములోని ఈ మాటలు పూర్తిగా నిరాకరిస్తాయి. మంచి వేదాంతశాస్త్రము కేవలం సరిగా నేర్చుకొనుటలోనికి మాత్రమేగాక సరిగా జీవించుటలోనికి నడిపిస్తుంది.

1 కొరింథీ. 8:1లో కొరింథీ సంఘమునకు వ్రాస్తూ పౌలు ఇవే మాటలు చెబుతున్నాడు.

> జ్ఞానము ఉప్పొంగజేయును గాని ప్రేమ క్షేమాభివృద్ధి కలుగజేయును (1 కొరింథీ. 8:1).

మరొకసారి 1 కొరింథీ 13:2లో అంటాడు:

> . . . మర్మములన్నియు జ్ఞానమంతయు ఎరిగినవాడనైనను, . . . ప్రేమలేనివాడనైతే నేను వ్యర్థుడను (1 కొరింథీ. 13:2).

వేదాంతశాస్త్రమును గూర్చి కొన్ని ఉద్దేశములు, లేక అంశముల విధానంలో నేర్చుకొనుట మీద దృష్టిపెట్టుట ద్వారా మనము బైబిలు స్థాయిని నెరవేర్చుట లేదు. బదులుగా, లేఖనముల విలువలను అనుసరించు వేదాంతశాస్త్రము మన సొంత నమ్మకములను కడిగివేస్తుంది.

అయితే, అదే సమయంలో, వేదాంతశాస్త్రములోని జీవన అవగాహనలో కూడా ఒక గొప్ప అపాయము ఉంది; ఇది జ్ఞాన-వ్యతిరేకత అనే అపాయములోనికి నడిపిస్తుంది. నేడు అనేక ఇవాంజెలికల్ అనుచరులు వేదాంతశాస్త్రములోని జ్ఞానము అనే కోణము మీద పూర్తిగా అపనమ్మకము కలిగియున్నారు కాబట్టి, వేదాంతశాస్త్ర సిద్ధాంతములను జాగ్రత్తగా అధ్యయనము చేయకుండా వెనకాడతారు. వారు వాస్తవానికి సాంప్రదాయక అధ్యయన-అవగాహన కలిగియున్న క్రమబద్ధమైన వేదాంతశాస్త్రము క్రైస్తవ జీవితమునకు హానికరమని నమ్ముతారు.

కొంతమంది నిజాయితీ గల ప్రజలు ఇలా మాట్లాడుట మీరు వినే ఉంటారు, “మనము సిద్ధాంతమును గూర్చి పట్టించుకోవలసిన అవసరం లేదని నేననుకుంటాను; అది కేవలము మన దృష్టిని క్రీస్తు మీద నుండి తొలగిస్తుంది.” లేక, కొందరు ఇలా మాట్లాడుట కూడా మీరు వినే ఉంటారు, “సంఘ నాయకునిగా ఉండుటకు మీరు వేదాంతశాస్త్రము చదవవలసిన అవసరం లేదు. మీకు కావలసినది కేవలం ఆత్మ నడిపింపు మాత్రమే.” మరియు ఈ మధ్యనే నేను విన్నట్లుగా “జ్ఞానముతో కూడిన క్రైస్తవ్యము మృతమైన క్రైస్తవ్యము.” ఇలాంటి మంచిగా-మాట్లాడుటకు ప్రయత్నించు విశ్వాసులు సాంప్రదాయక అధ్యయన-అవగాహన గల వేదాంతశాస్త్రము పట్ల అయిష్టత కలిగియుంటారు. విశ్వాసమునకు జ్ఞాన వ్యతిరేక పద్ధతి కొరకు దీనిని తిరస్కరిస్తారు. వారి జీవితములను జాగ్రత్తగా ఎంతో



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

పరిశ్రమతో సిద్ధపరచిన వేదాంతశాస్త్రము మీద నిర్మించకుండా, ఇలాంటి విశ్వాసులు చాలా సార్లు సరైన పరిశీలన లేకుండా తమ సొంత ఆత్మీయ అంతర్ దృష్టి మీద ఆధారపడతారు. వారు కేవలం ఒక బలమైన లేక ఆకర్షణీయమైన నాయకుని నిరాలోచనగా వెంబడిస్తారు. లేక వారు సాంప్రదాయక అధ్యయన వేదాంతశాస్త్రముకు బదులుగా అసాధారణమైన ఆత్మీయ అనుభవాల మీద ఆధారపడతారు. ఏదిఏమైనా, మనమంతా కూడా సంఘములోని జ్ఞాన-వ్యతిరేకత అనే గొప్ప అపాయమును ఎదురించాలి ఎందుకంటే అది క్రైస్తవ విశ్వాసమును గూర్చి అబద్ధ బోధలు మరియు తప్పుడు ఆలోచనలకు దారి తీస్తుంది మరియు అది అనేకమంది విశ్వాసుల జీవితముల మీద దుష్ప్రభావమును కలిగిస్తుంది.

2 తిమోతి 2:15లో తిమోతిని హెచ్చరించినప్పుడు పౌలు ఈ అపాయమును గ్రహించాడు.

> దేవునియెదుట యోగ్యునిగాను, సిగ్గుపడ నక్కరలేని పనివానిగాను, సత్యవాక్యమును సరిగా ఉపదేశించువానిగాను నిన్ను నీవే దేవునికి కనుపరచు కొనుటకు జాగ్రత్తపడుము (2 తిమోతి 2:15).

వేదాంతశాస్త్రమును మనము నిర్వచించు విధానమును మనలో ప్రతి ఒక్కరు జాగ్రత్తగా పరిశీలన చేయాలి. మనలో కొందరు స్వాభావికముగా అధ్యయన-అవగాహన వేదాంతశాస్త్రము వైపు మొగ్గుచూపి జీవితములోని ముఖ్యమైన విషయములను నిర్లక్ష్యము చేస్తాము. ఇంకా కొందరు జీవన అవగాహన వైపు మొగ్గుచూపి జ్ఞాన సంబంధమైన విషయాలను నిర్లక్ష్యం చేస్తాము. ఈ రెండు విపరీత పరిస్థితులను నివారించుటకు, ఈ రెండు ఆలోచనలలోను అపాయములు మరియు విలువలు ఉన్నాయని గుర్తించాలి. ఒకే సమయములో ఈ రెండు ఆలోచనలను హత్తుకొనుట వివేకముతో కూడిన మార్గము. మనకు అధ్యయనము కొరకు వేదాంతశాస్త్రము మరియు జీవనము కొరకు వేదాంతశాస్త్రము రెండు కావాలి.

వేదాంతశాస్త్రవేత్తలు వేదాంతశాస్త్రమును నిర్వచించిన కొన్ని మార్గములను చూసిన తరువాత, ఇప్పుడు మనము రెండవ విషయమును చూడబోతున్నాము: వేదాంతశాస్త్రము యొక్క లక్ష్యములు. మనము వేదాంతశాస్త్రమును పాటించుచుండగా మన లక్ష్యములు ఏమైయుండాలి? ఈ లక్ష్యములు ఒకదానితో ఒకటి ఏ విధంగా ముడిపడియున్నాయి?

## లక్ష్యములు

ఈ ప్రశ్నలకు జవాబిచ్చుటకు మనము మూడు విషయములను చూద్దాము: మొదటిగా, మనము వేదాంతశాస్త్రము యొక్క మూడు ప్రాథమిక లక్ష్యములను గుర్తించుదాము; రెండవదిగా, ఈ మూడు లక్ష్యములు ఒకదాని మీద ఒకటి ఎలా ఆధారపడియుంటాయో చూద్దాము; మరియు మూడవదిగా, ఈ మూడు లక్ష్యములకు ఇవ్వవలసిన ప్రాధాన్యతలను చూద్దాము. మొదటిగా వేదాంతశాస్త్రము యొక్క లక్ష్యములను వర్ణించుచు ఆరంభించుదాము.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

## ప్రాథమిక లక్ష్యములు

వేదాంతశాస్త్రము యొక్క లక్ష్యములను వివరించుటకు అనేక మార్గములు ఉన్నాయి కాబట్టి వాటన్నిటిని ఇక్కడ తెలియజేయుట అసాధ్యము. సర్వసాధారణంగా, మనము క్రైస్తవులుగా ప్రతి పనిని ఎందుకు చేస్తామో అందుకే వేదాంతశాస్త్రమును కూడా పాటిస్తాము. వెస్ట్మినిస్టర్ షార్టర్ కెటకిజంలోని మొదటి ప్రశ్న యొక్క భాషలో, మనము "దేవుని మహిమపరచి ఎల్లప్పుడూ ఆయనను ఆస్వాదించుట"కు వేదాంతశాస్త్రము ఒక మార్గము. కాని, దీని కంటే క్లుప్తంగా చెప్పుట కూడా సాధ్యమే. ఈ ప్రక్రియలో దేవుని మహిమపరచుటకు ప్రయత్నిస్తూ ఆయనను ఆస్వాదించుట కొరకు వేదాంతశాస్త్రవేత్తలు కొన్ని ప్రత్యేకమైన మార్గములను కలిగియుండాలి.

అనేక విధాలుగా, ఇప్పటి వరకు మనము చూసిన పలు వేదాంతశాస్త్ర నిర్వచనములు వేదాంతశాస్త్రము యొక్క పలు లక్ష్యములను తెలుసుకొనుటకు ఒక ఆరంభ బిందువుగా ఉంటాయి. ఒక ప్రక్క, క్రమబద్ధమైన వేదాంతశాస్త్రమును ప్రాథమికంగా ఒక విజ్ఞానముగాను, ఒక అధ్యయన రంగ జ్ఞానముగాను నిర్వచించుట ఒక లక్ష్యము జ్ఞానపూర్వకమైనది లేక విషయపూర్వకమైనది అని, అనగా జ్ఞాన సంబంధ విషయముల మీద దృష్టిపెట్టు సిద్ధాంతములను బోధించుట లేక అభివృద్ధిచేయుటను సూచించుచున్నది; మరియు మరొక ప్రక్క, జీవన అవగాహన కలిగి వేదాంతశాస్త్రమును నిర్వచించుట, క్రీస్తులో మన పరిపూర్ణ జీవితమునకు సంబంధించిన అనేక విషయముల మీద దృష్టిపెట్టు బోధనలను లేక సిద్ధాంతములను అభివృద్ధి చేయుటయే మన లక్ష్యము అని సూచిస్తుంది.

వేదాంతశాస్త్రము యొక్క మూడు ప్రాథమిక లక్ష్యములను గూర్చి మాట్లాడుతూ వేదాంతశాస్త్రమునకు ఈ రెండు అవగాహనలను నిర్మించుదాము. మనము సాంప్రదాయకత (ఆర్థోడాక్సి), సుప్రవర్తన (ఆర్థోప్రాక్సిస్), మరియు సరైన భావనలను (ఆర్థోపాథోస్) గూర్చి మాట్లాడదాము. మొదటిగా సాంప్రదాయకత యొక్క లక్ష్యమును చూద్దాము.

### సాంప్రదాయకత

మొదటిగా, ప్రతి బాధ్యతాయుతమైన క్రైస్తవ వేదాంతశాస్త్రములో సిద్ధాంత సాంప్రదాయకత ఒక ముఖ్యమైన లక్ష్యము. సాంప్రదాయకత అనే పదమును వేర్వేరు సంఘములు వేర్వేరు రకములుగా ఉపయోగిస్తారు, కాని ఇక్కడ మనము ఈ పదమును "సరైన లేక సూటైన ఆలోచన" అనే అర్థములో ఉపయోగిద్దాము. సాంప్రదాయకత యొక్క లక్ష్యము సరైన లేక నిజమైన సిద్ధాంతములను చేరుకొనుట. మన డినామినేషన్ లేక సంఘము ఏదైనా సరే, మనము వేదాంతశాస్త్రమును గూర్చి ఆలోచన చేయునప్పుడు మనము నమ్మువాటి యొక్క వాస్తవికతపై మన ఆసక్తి ఎంతో కొంత ఉంటుంది. దేవునిని గూర్చి, లోకమును గూర్చి మరియు మనను గూర్చి సరైన విషయములను మనము నమ్మాలని ఆశిస్తాము. వేదాంతశాస్త్ర చరిత్రలో సాంప్రదాయకత యొక్క లక్ష్యమునకు ఉన్న ప్రాముఖ్యతను నిర్లక్ష్యము చేయుట కష్టము. నిస్సందేహంగా, ఈ విషయములను గూర్చిన ఆందోళన ఎక్కువ వేదాంతశాస్త్ర కార్యకలాపాలకు ప్రాథమిక ఆసక్తిగా ఉన్నది.

లూయిస్ బెర్కాఫ్ వ్రాసిన సిస్టమాటిక్ థియోలజి యొక్క మూడవ భాగములోని విషయ సూచికను ఒకసారి చూడండి. ఈ అధ్యాయములోని విషయములు "క్రీస్తు యొక్క మూర్తిమత్వము మరియు కార్యము" అను అంశమును ఈ విధంగా వివరిస్తాయి:



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

క్రీస్తు యొక్క మూర్తిమత్వము
I. చరిత్రలో క్రీస్తును గూర్చిన సిద్ధాంతములు
II. క్రీస్తు యొక్క పేర్లు మరియు స్వభావములు
III. క్రీస్తు యొక్క ఏకమూర్తిమత్వము

క్రీస్తు యొక్క స్థితులు
I. క్రీస్తు యొక్క అవమానము
II. క్రీస్తు యొక్క ఘనత

క్రీస్తు యొక్క బాధ్యతలు
I. ఉపోద్ఘాతము: ప్రవక్త బాధ్యత
II. యాజకత్వ బాధ్యత
III. ప్రాయశ్చిత్తము యొక్క కారణము మరియు అవసరత
IV. ప్రాయశ్చిత్తము యొక్క స్వభావము
V. ప్రాయశ్చిత్తమునకు పలు సిద్ధాంతములు
VI. ప్రాయశ్చిత్తము యొక్క ఉద్దేశము మరియు విస్తృతి
VII. క్రీస్తు యొక్క విజ్ఞాపన కార్యము
VIII. రాజరిక బాధ్యత

బెర్కాఫ్ ఈ అధ్యాయములను వ్రాయుచుండగా, శ్రోతలు సాంప్రదాయక లేక సరైన సిద్ధాంతమును నేర్చుకొని, సరైన ఆలోచనలను అర్థము చేసుకోవాలనేది ఆయన ముఖ్య ఉద్దేశము అని ఈ సంక్షిప్త వర్ణన స్పష్టముగా తెలియజేస్తుంది.

ఇదివరకు, వేదాంతశాస్త్రవేత్తలకు దీనిని ఘనపరచి క్రైస్తవ విశ్వాసములోని ఈ అంశమును సంపూర్ణ సత్యముగా చూపుట చాలా సులువుగా ఉండేది. కాని నేడు, త్వరిత సంభాషణలు మరియు ప్రజల యొక్క ప్రపంచవ్యాప్త కదలిక వలన, క్రైస్తవ్యేతర విశ్వాసములను మనము ప్రతి కోణములో ఎదుర్కొంటాము, మరియు ఇది చాలా మంది ప్రజలలో గందరగోళం కలిగించి, సత్యమును మరియు సరైన ఆలోచనను అన్వేషించుటకు బలహీనులుగా చేస్తుంది.

మన సాంప్రదాయక విశ్వాస సత్యములను గూర్చి మనము అంత ఖచ్చితముగా చెప్పగలమా అని అనేక మంది వేదాంతశాస్త్రవేత్తలు కూడా ఆశ్చర్యపడుతున్నారు. క్రైస్తవ సమాజమునకు వెలుపల నుండి కలిగే గందరగోళం కలిగించే ప్రభావములతో పాటు, కేవలం కొన్ని ముఖ్యమైన సిద్ధాంతములు మినహా ఇతర విషయముల మీద సమ్మతించు క్రైస్తవులను కనుగొనుట కూడా కష్టమవుతుంది అనే సత్యమును కూడా మనము ఎదుర్కోవాలి.

ఈ వర్తమాన ధోరణుల మధ్యలో కూడా, సాంప్రదాయక ఆలోచనలను అభివృద్ధి చేయుటను మనం పునరుద్ఘాటించాలి, మనము నిజమైన సిద్ధాంతములు అని పిలచే ఒక గుంపు వేదాంతశాస్త్రము యొక్క ఒక ముఖ్యమైన లక్ష్యముగా ఉండాలి. సాంప్రదాయకతను అనుసరించుటలో మనము నేడు ఎదుర్కొను సవాళ్లు ఏ విధంగాను విశేషమైనవికావు. మనము నేడు ఎదుర్కొనుచున్న విధముగానే యేసు మరియు ఆయన శిష్యులు కూడా ఆ రోజులలో బహుగా వ్యాపించిన మతపరమైన భిన్నత్వమును ఎదుర్కొన్నారు.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

అయినను, ఆయనను అనుసరించువారు సత్యమును అన్వేషించువారిగా ఉండాలని యేసు ఆయన శిష్యులకు నిర్మొహమాటంగా చెప్పాడు.

యోహాను 17:17లో ఆయన తండ్రికి ఈ విధంగా ప్రార్థించెను అని గుర్తుంచుకోండి:

> సత్యమందు వారిని ప్రతిష్ఠ చేయుము; నీ వాక్యమే సత్యము (యోహాను 17:17).

నిజమైన సిద్ధాంతమును గూర్చి యేసు లోతుగా చింతించాడు. వేదాంతశాస్త్రమునకు సాంప్రదాయకత ఒక ముఖ్యమైన లక్ష్యము అని యేసు వక్కాణించాడు, మరియు ఆయన అనుచరులుగా మనము కూడా అదే చెయ్యాలి.

వేదాంతశాస్త్రము యొక్క విషయ లక్ష్యమును దృష్టిలో పెట్టుకొని, సుప్రవర్తన యొక్క లక్ష్యమును చూద్దాము.

## సుప్రవర్తన లేక ఆర్థోప్రాక్సిస్

సులువుగా మాట్లాడితే, ఆర్థోప్రాక్సిస్ అనగా సరైన ప్రవర్తన లేక అభ్యాసము మీద దృష్టిపెట్టు సిద్ధాంతములను లేక బోధలను అభివృద్ధి చేయుట. వేదాంతశాస్త్రము యొక్క మూలుగ "దేవుని కొరకు జీవించుట" అను సిద్ధాంతము అని విలియం అమెస్ వివరించిన విషయము మీకు గుర్తుండియుంటుంది. దేవుని కొరకు జీవించుటలో ఒక భాగము మన అభ్యాసము లేక ప్రవర్తన. వేదాంత విషయములను గూర్చి సరిగా ఆలోచన చేయుట మాత్రమే సరిపోదు. వాటిని మనము అభ్యాసములో, అనగా సరైన అభ్యాసములో పెట్టాలి.

క్రైస్తవ వేదాంతశాస్త్రము మనలను సరైన లేక నిజమైన క్రియలలోనికి నడిపించాలని స్పష్టమవుతుంది. ఉదాహరణకు, మనము ప్రార్థన చేయాలని, సువార్త ప్రకటించాలని, ఆరాధన చేయాలని, ఒకరినొకరు సేవించాలని, మరియు పేదలకు ధారాళముగా ఇవ్వాలని వేదాంతశాస్త్రములో మనము నేర్చుకొంటాము. కాని ఒక బాధ్యతాయుతమైన క్రైస్తవ వేదాంతశాస్త్రములో ఈ సత్యములను గూర్చి లేక ఇతర సత్యములను గూర్చి నేర్చుకొనుట మాత్రమే సరిపోదు. ఈ సత్యములను సరైన కార్యములలోనికి అనగా ఆర్థోప్రాక్సిస్ లోనికి నడిపించాలి.

దుఃఖకరంగా, ఆర్థోప్రాక్సిస్ యొక్క వేదాంతశాస్త్ర లక్ష్యము మీద వారి ఆసక్తిని స్థిరపరచుటకు ఇవాంజెలికల్ క్రైస్తవులు గొప్ప సవాలును ఎదుర్కొంటారు. మొదటిగా, సంఘము వెలుపల ఉన్నవారు నైతిక ఉత్తమములు లేవని, అనగా ఏ ప్రవర్తనలు కూడా స్పష్టముగా మంచివి లేక చెడ్డవి కావని, మనలను తరచుగా వేధిస్తుంటారు. మన సంస్కృతుల యొక్క ఉరవడికి వ్యతిరేకముగా నిలబడి ప్రవర్తనలలో మంచి చెడులు ఉన్నాయని చెప్పుటకు మనలో చాలా మందిమీ అలసిపోయాము.

కాని అంతమాత్రమే కాకుండా, సంఘములో ఆర్థోప్రాక్సిస్ ను ఒక ముఖ్యమైన లక్ష్యము అని చెప్పుటలో మనము మొహమాటపడుటకు కారణము క్రైస్తవులుగా మనము గతకాలములో ఈ విషయమందు వైఫల్యములు ఎదుర్కొనుటయే. సత్యము అనే పేరును ఉపయోగించి సంఘము ఎన్నో పాపములు చేసింది. సంఘ చరిత్రలో ఎంతో ఘోరమైన ప్రవర్తనలను గాఢమైన వేదాంతశాస్త్ర తర్కముతో సమర్థించుట మనము చూడవచ్చు. మతపరమైన ప్రజలు, నిజాయితీగల క్రైస్తవులు కూడా చాలా సార్లు తమ వేదాంతశాస్త్రమును ఘోరమైన పాపములను సమర్థించుటకు ఉపయోగించారు అనేది చరిత్రలో ఒక దుఖకరమైన వాస్తవము.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

కాని ఈ గంభీరమైన భిన్నత్వాల మధ్యలో కూడా, ఆర్థోప్రాక్సిస్ చాలా అవసరమైనది ఎందుకంటే మన ప్రవర్తనలను దేవుడు పరిగణిస్తున్నాడు. మన మంచి మరియు చెడ్డ క్రియలు మన నిత్య బహుమానముల మీద ప్రభావం చూపుతాయి. మనము చేయు సత్క్రియల ద్వారా దేవుడు మన తోటి విశ్వాసులతో మాట్లాడగలడు మరియు సరైన ప్రవర్తన ద్వారా మనము విశ్వసించని లోకములో క్రీస్తుకు బలమైన సాక్ష్యులుగా ఉండగలము. ఈ కారణములు మరియు ఇతర కారణముల వలన, ఆర్థోప్రాక్సిస్ అనేది వేదాంతశాస్త్రములో ఒక ముఖ్యమైన లక్ష్యము కావాలి. అయితే ఈ పనిలో పలు స్థాయిలలో మనము జాగ్రత్తలను వహించాలి; ప్రతి కోణములోను మనము చేయు పనులలో నమ్రత మరియు ప్రేమ కనిపించాలి. మరియు మనము క్రైస్తవ జీవనమును కేవలం క్రియలుగా మాత్రమే మార్చకూడదు. అయితే, వేదాంతశాస్త్రము కేవలం విషయముల ఖచ్చితత్వమును గూర్చి మాత్రమే పట్టించుకునేదిగా గాక, మనము పాటించవలసిన క్రియలను కూడా బోధించాలి.

యాకోబు 2:19, ఆయన ఈ మాటలను వ్రాసాడు:

> దేవుడొక్కడే అని నీవు నమ్ముచున్నావు. ఆలాగు నమ్ముట మంచిదే;
> దయ్యములును నమ్మి వణకుచున్నవి (యాకోబు 2:19).

ఈ ఒక్క విషయంలో, అపవాది కూడా సాంప్రదాయకతను పాటించువాడే. అయితే అపవాది యొక్క సాంప్రదాయకత వానికి ఏ మేలు చేస్తుంది?

సాతానుడు త్రిత్వమును నమ్ముతాడని నేననుకుంటాను; యేసు పాపుల కొరకు మరణించెనని వాడు నమ్ముతాడు; పునరుత్థానము జరిగినది అని కూడా నమ్ముతాడు; విశ్వాసము ద్వారా కృప మూలముగా కలుగు రక్షణ సువార్త కూడా వానికి తెలుసు. అయినను, ఈ నిజమైన నమ్మికలు కూడా సాతానుకు ఎలాంటి శాశ్వత లాభమును కలిగించవు ఎందుకంటే వాడు సాంప్రదాయకత నుండి సుప్రవర్తనలోనికి, ఆరాధనలోనికి మరియు ఏక సత్య దేవుని సేవలోనికి కొనసాగడు. సరైన ప్రవర్తనను క్రైస్తవ వేదాంతశాస్త్రము యొక్క కడపటి లక్ష్యముగా చేయు శోధనను మనము అధిగమించాలి; ఆర్థోప్రాక్సిస్ వేదాంతశాస్త్రము యొక్క ముఖ్యమైన లక్ష్యముగా ఉండాలి.

సాంప్రదాయకత లేక ఆర్థోడాక్సి మరియు ఆర్థోప్రాక్సిస్ తో పాటుగా, వేదాంతశాస్త్రము యొక్క మరొక లక్ష్యమును కూడా మనము ప్రస్తావించాలి: ఈ వేదాంతశాస్త్ర లక్ష్యమును "ఆర్థోపాథోస్" అని పిలుస్తాము మరియు దీని అర్థము "సరైన లేక ఖచ్చితమైన భావనలు లేక భావోద్వేగాలు."

## ఆర్థోపాథోస్

దేవుని కొరకు జీవించుట అంటే మన లోతైన భావనలు కూడా ఆయన సేవ కొరకు సమర్పించుకొనుట: మన ఆనందములు, మన నిరాశలు, మన ఆకాంక్షలు, మన కోపము, మన ఉల్లాసము మరియు అనేక ఇతర భావనలు దేవుని చిత్తము యొక్క అనుగుణ్యములోనికి రావాలి. దురదృష్టవశాత్తు, అధ్యయన వేదాంతశాస్త్రవేత్తలు నిర్లక్ష్యము చేయు వేదాంతశాస్త్ర లక్ష్యము ఏదైనా ఉంటె, అది ఆర్థోపాథోస్ అనే లక్ష్యము. వేదాంతశాస్త్రము యొక్క భావాత్మక కోణముల యొక్క నిర్లక్ష్యం రెండు కారణముల వలన జరుగుతుంది.

మొదటిగా, అనేకమంది అధ్యయన వేదాంతశాస్త్రవేత్తలు భావనలు వ్యక్తపరచుటలో మానసికంగా నైపుణ్యములేనివారిగా ఉన్నారు. వాస్తవానికి, చాలా సార్లు నిస్సారమైన అధ్యయన పద్ధతి యొక్క



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

ప్రభావములో, ప్రజలు అధ్యయన వేదాంతశాస్త్రములో ఉద్యోగాలు సంపాదించి, జీవితము యొక్క భావాత్మక కోణములను ఎదుర్కొనకుండా తప్పించుకొనుటకు ప్రొఫెసర్లుగాను అధ్యాపకులుగాను అవుతారు. అందువలన, అధ్యయన వృక్షశాస్త్ర పాఠ్యపుస్తకములో వ్రాయబడిన విధముగా కూడా ఆహ్లాదము, ఆనందము, బాధ, జాలి, శ్రద్ధ మరియు ప్రేమ వంటి వ్యక్తీకరణలు అధ్యయన వేదాంతశాస్త్ర రచనలలో కనిపించకపోవుట ఆశ్చర్యం కాదు. ఒకవేళ మీరు ఎప్పుడైనా అధ్యయన వేదాంతశాస్త్రమును చదివినట్లయితే, దానిలో భావాత్మక విషయములకు చాలా తక్కువ ప్రాధాన్యత ఇచ్చుటను మీరు గమనించియుంటారు, మరియు దీనికి కారణం ఉద్యోగరిత్యా వేదాంతశాస్త్రవేత్తలు భావనలకు ఎక్కువ విలువ ఇవ్వకపోవుట కావచ్చు, లేక వారు స్వయంగా భావాత్మక పరిపక్వత లేనివారు కావచ్చు.

ఆర్థోపాథోస్ కు రెండవ ఆటంకము ఏమనగా, అనేకమంది ఇవాంజెలికల్ విశ్వాసులు భావనలను నీతిబాహ్యమైననవిగా పరిగణించు ఉచ్చులో పడిపోయారు; అనగా అవి నైతికముగా తటస్థమైనవి అని అర్థం. కొన్ని భావనలు సరైనవి మరికొన్ని సరికానివి అని చెప్పుట మంచిది కాదు అని వారు అంటారు. ఆర్థోపాథోస్, లేక సరైన భావనలు అనే ఆలోచన తప్పుదారిపట్టిస్తుంది అని వారు నమ్ముతారు. మరియు భావనలు నీతిబాహ్యమైనవి అనే ఆలోచన ఎంత ప్రఖ్యాతిగాంచినప్పటికీ, ఇది బైబిలు దృష్టికోణముల కంటే ఎక్కువగా కొన్ని ఆధునిక మానసికశాస్త్ర సిద్ధాంతములకు అనుగుణమైన ఆలోచన.

వేదాంతశాస్త్ర రచనలలో అపొస్తలుడైన పౌలు యొక్క రచనలు పాథోస్ కు అద్భుతమైన ఉదాహరణగా ఉన్నాయి. పౌలు సాంప్రదాయకతపై ఎక్కువ ఆసక్తి చూపేవాడని మనందరికీ తెలుసు; సత్యమును అన్వేషించుటకు ఆయన కట్టుబడియున్నాడు. అయినను, మాటిమాటికి, సత్యమును గూర్చి వ్రాసినప్పుడు, పౌలు తన భావనలను దాచిపెట్టలేకపోయాడు. సాంప్రదాయకత మీద ఆయన విశ్లేషణలు అదే సమయములో భావనాత్మక వ్యక్తీకరణలకు కూడా దారితీసాయి.

నాకు జ్ఞాపకముంది, మొదటి మరియు రెండవ కొరింథీ పత్రిక మీద ఒక వ్యాఖ్యానమును వ్రాయునప్పుడు, చాలా సార్లు ఒక వేదాంతశాస్త్ర తర్కము మధ్యలో పౌలు భావనలను వ్యక్తపరచుటను చూసి నేను ఆశ్చర్యపోయాను. లేక మరొక ఉదాహరణగా, పౌలు యొక్క లోతైన వేదాంత రచనగా కొనియాడబడిన రోమా పత్రికను చూడండి. భవిష్యత్తు కొరకు దేవుని ప్రణాళికలో యూదులు మరియు అన్యజనుల యొక్క స్థానమును గూర్చి కొన్ని క్లిష్టమైన సమస్యలను గూర్చి 9-11 అధ్యాయములలో విశ్లేషణ చేసిన తరువాత, పౌలు ఒక ప్రసంశను వ్యక్తపరచాడు. రోమా 11:33-36లో మనము ఈ క్రింది మాటలను చదువుతాము:

> **ఆహా, దేవుని బుద్ధి జ్ఞానముల బాహుళ్యము ఎంతో గంభీరము; ఆయన తీర్పులు శోధింపనెంతో అశక్యములు; ఆయన మార్గములెంతో అగమ్యములు. ప్రభువు మనస్సును ఎరిగినవాడెవడు? ఆయనకు ఆలోచన చెప్పిన వాడెవడు? ముందుగా ఆయనకిచ్చి, ప్రతిఫలము పొందగలవాడెవడు? ఆయన మూలముననను ఆయన ద్వారాను ఆయన నిమిత్తమును సమస్తము కలిగియున్నవి. యుగముల వరకు ఆయనకు మహిమ కలుగును గాక. ఆమేన్ (రోమా 11:33-36).**

ఇప్పుడు ఒక అధ్యయన వేదాంతశాస్త్ర గ్రంథము మధ్యలో ఇలాంటి విషయమును మీరు చివరిసారి ఎప్పుడు చదివారు?



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

## పరస్పరాధారితము

ఇప్పటి వరకు వేదాంతశాస్త్రము యొక్క మూడు ముఖ్యమైన లక్ష్యములను పరిచయం చేసాము కాబట్టి, ఇప్పుడు వాటి యొక్క పరస్పరాధారితమును గూర్చి వ్యాఖ్యానించుదాము. వేదాంతశాస్త్రము యొక్క లక్ష్యములలో ఒకదానిని కూడా మనము నిర్లక్ష్యము చేయకుండా ఉండుటకు వాటి యొక్క పరస్పర ఆధారత ముఖ్యమైన కారణము. అవి ఎంతగా మిళితమైయున్నాయంటే మిగిలిన రెండు విషయములలో బలమును పొందకుండా ఒక దానిలో మనము బలవంతులము కాలేము.

మా అభిప్రాయమును వివరించుటకు, మనము మూడు విషయములను చూద్దాము. మొదటిగా, సాంప్రదాయకత ఇతర రెండింటిని ఎలా బలపరుస్తుందో చూద్దాము. తరువాత ఆర్థోప్రాక్సిస్ ఇతర రెండు వేదాంతశాస్త్ర లక్ష్యములను ఎలా బలపరుస్తుందో చూద్దాము. మరియు మూడవదిగా, ఆర్థోపాథోస్ ఇతర రెండింటికి ఎలా సహాయము చేస్తుందో పరిగణిద్దాము. ఆర్థోడాక్సి లేక సరైన ఆలోచన మన ఇతర రెండు వేదాంతశాస్త్ర లక్ష్యములను ఎలా ప్రోత్సహిస్తుందో చూచుటతో ఆరంభిద్దాము.

### సాంప్రదాయకత

ఆర్థోప్రాక్సిస్ మరియు ఆర్థోపాథోస్ సంభవించుటకు కొంత మాత్రలో సాంప్రదాయకత అవసరమను నియమము నేడు అనేక మంది ఇవాంజెలికల్ విశ్వాసులకు తెలుసు. మనము ముందు సత్యమును గ్రహించి తరువాత దానిని మనము మన జీవితాలకు అన్వయించుకోవాలని అధ్యయన మరియు ప్రఖ్యాతిగాంచిన వేదాంతశాస్త్రవేత్తల నుండి నేర్చుకొంటాము. క్రైస్తవులు మరింత సూటైన పద్ధతిలో కూడా పని చేయుట సర్వసాధారణమైన విషయము: “నేను నమ్మునది, నేను జీవించు విధానము మీద ప్రభావము చూపుతుంది.” మరియు ఇది నిజమే. మనము సత్యమును గూర్చి నేర్చుకొను విషయములు మన జీవనము మీద లోతైన ప్రభావము చూపుతాయి.

వేదాంతశాస్త్ర ఆలోచనలను అధ్యయనము చేయుట ద్వారా మన సాంప్రదాయకత అభివృద్ధి చెందుచుండగా, మనము నిజమని నమ్మునది మన ప్రవర్తన మరియు భావనలను నిర్ధారిస్తుంది లేక సవాల్ చేస్తుంది. మీరు స్వాభావికముగా ఇతరుల పట్ల జాలి కలిగి ఆ భావనకు అనుగుణంగా కార్యము చేయువారు కావచ్చు. ఇప్పుడు, దేవుని స్వరూపములో మానవత్వము మరియు ఇతరుల పట్ల దయ మరియు కరుణ యొక్క ప్రాముఖ్యత వంటి బైబిలు విషయములను మీరు నేర్చుకొనుచుండగా, మీరు స్వాభావికముగా హత్తుకొను మీ మునుపటి ప్రవర్తనలు మరియు భావనలు మీ సాంప్రదాయక ఆలోచనల యొక్క అభివృద్ధి ద్వారా నిర్ధారించబడుతున్నాయి మరియు ప్రోత్సహించబడుతున్నాయని మీరు కనుగొంటారు.

అదే సమయములో, సాంప్రదాయక ఆలోచనలు మన ప్రవర్తనలు మరియు భావనలను సవాల్ చేయగలవు. మీరు స్వార్థం మరియు లోభం వంటి విషయములతో సంఘర్షించు ఒక వ్యక్తి కావచ్చు. మీరు పేదలను నిర్లక్ష్యము చేయుచు వారి బాధను తగ్గించుటకు ఏమి చేయకపోవచ్చు. అప్పుడు మీ వేదాంతశాస్త్ర ఆలోచన మరింత బైబిలు ఆధారము అయ్యినప్పుడు, మీ ప్రవర్తనలు మరియు భావనలు మీ సాంప్రదాయక ఆలోచనల ద్వారా సవాల్ చేయబడతాయి. ఈ విధంగా మరియు అనేక విధాలుగా, మన సాంప్రదాయకతను అభివృద్ధి చేయుట ద్వారా మనము జీవించు విధానములు నిర్ధారించబడి మరియు సవాల్ చేయబడి, ఆర్థోప్రాక్సిస్ మరియు ఆర్థోపాథోస్ బలపరచబడతాయి.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

## సుప్రవర్తన లేక ఆర్థోప్రాక్సిస్

ఇప్పుడు మన వేదాంతశాస్త్ర లక్ష్యములు ఒకదాని మీద మరొకటి ఆధారపడు రెండవ మార్గమును చూద్దాము. ఆర్థోప్రాక్సిస్ మన సాంప్రదాయకత మరియు మన ఆర్థోపాథోస్ లను ఎలా బలపరచగలదు? మన ప్రవర్తన మన నమ్మకములు మరియు భావనల మీద ఎలా ప్రభావము చూపగలదు?

ఒకవైపు, మన ప్రాక్సిస్ లేక కార్యములు మనము సత్యము అని నమ్మెదానిని నిర్ధారించగలవు లేక సవాల్ చేయగలవు. తరచుగా జరుగు ఉదాహరణలలో ఒకటి, "మనము ఎందుకు ప్రార్థన చేయాలి?" అని ఒక వేదాంతశాస్త్ర విద్యార్థిని మీరు అడుగుట.

చాలా సార్లు, విశ్వాసులకు ప్రార్థన చేయు అలవాటు లేనప్పుడు, ఈ ప్రశ్నకు వారు ఇచ్చు జవాబు చాలా బలహీనంగా ఉంటుంది, "దేవుడు ఆజ్ఞాపించాడు కాబట్టి మనం ప్రార్థన చేయాలి" వంటి జవాబులు వినిపిస్తుంటాయి. ఇప్పుడు, ఈ జవాబు నిజమైనప్పటికీ, ఒక ప్రార్థన యోధుడు, అనగా ఒక సంపూర్ణమైన పూర్తిగా అభివృద్ధి చెందిన ప్రార్థనా జీవితమును కలిగియున్న వ్యక్తి, ఈ విధంగా జవాబు ఇచ్చుట నేను ఎన్నడు వినలేదు. అనేక సంవత్సరాల ప్రార్థన అనుభవము ప్రార్థన కొరకు ఇంకా అనేక కారణములను చూచునట్లు ఆ వ్యక్తిని సున్నితపరుస్తాయి. మనకు ఆజ్ఞ ఇవ్వబడినది కాబట్టి ప్రార్థన చేయాలను మాట నిజమేగాని, ప్రార్థనా అనుభవము లేకపోవుట ప్రార్థన కొరకు ఇంకా అనేక బైబిలు ప్రేరణలను చూడలేకుండా ఆటంకం కలిగిస్తుంది.

దీనికి భిన్నంగా, మన అభ్యాసములు మనలను సాంప్రదాయకతకు మరింత దగ్గరగా నడిపించగలవు. విశ్వాసులు ప్రార్థనలో ఎక్కువ అనుభవం గలవారైయున్నప్పుడు, ప్రార్థించుట కొరకు బైబిలు ఇచ్చు పలు విధములైన కారణములను స్పష్టముగా చూడగలుగుతారు. దేవుడు మన ప్రార్థనలకు యోగ్యుడు కాబట్టి మనము ప్రార్థన చేస్తాము. ఆయన మనకు కావాలి కాబట్టి మనము ప్రార్థన చేస్తాము. మనము ప్రార్థన చేయుటకు మరొక కారణం యాకోబు 5:16లో యాకోబు చెబుతున్నాడు:

> నీతిమంతుని విజ్ఞాపన మనఃపూర్వకమైనదై బహు బలముగలదై యుండును (యాకోబు 5:16).

దైవికమైన ప్రవర్తన యొక్క లేమి మన నుండి ఈ వేదాంతశాస్త్ర నమ్మకములను దూరముచేస్తుంది, కాని ప్రార్థనలో పరిశుద్ధమైన జీవిత అనుభవము మన నమ్మకములను అనేక విధములుగా సవాల్ చేస్తుంది, నిర్ధారిస్తుంది, మరియు బలపరుస్తుంది.

దీని కంటే ఎక్కువ, మన అభ్యాసములు వేదాంతశాస్త్రము యొక్క భావనాత్మక కోణముల మీద కూడా ప్రభావము చూపగలవు. మనము చేయునది మన భావనల మీద ప్రభావము చూపుతుంది, మన భావనలను నిర్ధారిస్తుంది లేక సవాల్ చేస్తుంది. ఉదాహరణకు, విశ్వాసులు ఘోరమైన పాపములను చేసినప్పుడు, చాలా సార్లు వారు అపరాధభారము మరియు నేరస్థాపన అనే భావనాత్మక అనుభవములను ఎదుర్కొంటారు. అదే సమయంలో, మనము సరైన పనులు చేసినప్పుడు, దేవుని నిర్ధారణ మరియు ఆశీర్వాదములో కలుగు ఆనందమును సంతోషమును పొందుకుంటాము.

మనము ఇంతకు ముందు చూసినట్లు, మనము నమ్మునది మనము చేయు వాటి మీద మరియు భావనల మీద ప్రభావం చూపుతుంది. ఇప్పుడు వేదాంతశాస్త్రము యొక్క లక్ష్యముల యొక్క పరస్పర ఆధారములోని చివరి దృష్టికోణమును క్లుప్తంగా చూద్దాము.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

### ఆర్థోపాథోస్

అందుకే కీర్తనలలో కీర్తనకారుల యొక్క భావనలు వారి యొక్క ఆలోచన మరియు వారి క్రియలను ఏదో ఒక వైపుకు నడిపుచున్నట్లు మనము చూస్తాము. ఒకవైపు, కీర్తనకారుడు విడనాడబడెను అని భావించినప్పుడు, అతని సాంప్రదాయక ఆలోచన భావనలు అతడు అనుభవించిన శ్రమల మీద, మరియు దేవుని మీద అతని విశ్వాసము ఈ శ్రమల మీద ఎలాంటి ప్రభావము చూపుతుంది అనేదాని మీద ముఖ్యముగా దృష్టిపెడుతుంది. ఉదాహరణకు, కీర్తనలు 13:1, 3లో దావీదు అంటాడు:

> యెహోవా, ఎన్నాళ్లవరకు నన్ను మరచిపోవుదువు? నిత్యము మరచెదవా? నాకెంతకాలము విముఖుడవై యుందువు? . . . నామీద దృష్టియుంచి నాకుత్తరమిమ్ము (కీర్తనలు 13:1, 3).

అంతేగాక, కీర్తనకారుని యొక్క భావనలు కూడా అతని క్రియల మీద ప్రభావము చూపుతాయి. దిక్కులేనివారిగా ఉన్నప్పుడు, కీర్తనకారులు ఊరకనే ఉండలేదు; వారు వెక్కివెక్కి ఏడ్చేవారు, వారు రోగగ్రస్తులయ్యేవారు. కీర్తనలు 6:6లో కీర్తనకారుడు చెబుతున్నట్లు:

> నేను మూలుగుచు అలసియున్నాను ప్రతి రాత్రియు కన్నీరు విడుచుచు నా పరుపు తేలజేయుచున్నాను. నా కన్నీళ్లచేత నా పడక కొట్టుకొని పోవుచున్నది (కీర్తనలు 6:6).

అదే సమయములో, కీర్తనకారులు ఆనందముతో నిండినప్పుడు, నాట్యముతోను స్తుతులతోను ప్రభువును స్తుతించుటకు శక్తిని పొందుకున్నారు. కీర్తనలు 30:11 వచనములో ఈ విధంగా వ్రాయబడియున్నది:

> నా ప్రాణము మౌనముగా నుండక నిన్ను కీర్తించునట్లు నా అంగలార్పును నీవు నాట్యముగా మార్చియున్నావు (కీర్తనలు 30:11).

మూడు వేదాంతశాస్త్ర లక్ష్యములైన ఆర్థోడాక్సి, ఆర్థోప్రాక్సిస్ మరియు ఆర్థోపాథోస్ చాలా ఎక్కువగా పరస్పరాధారితమైనవని ఈ ఉదాహరణలలో నుండి మనము చూడవచ్చు. మన నమ్మికలు ఎల్లప్పుడూ మన క్రియలు మరియు వైఖరి మీద ఏదో ఒక ప్రభావము చూపుతాయి. మన అలవాట్లు మన నమ్మికలు మరియు భావనల మీద ప్రభావము చూపుతాయి. మరియు మన భావనలు మన ప్రవర్తన మరియు నమ్మికల మీద ఏదో ఒక విధంగా ప్రభావం చూపుతాయి.

వేదాంతశాస్త్రము యొక్క మూడు లక్ష్యములు పరస్పర ఆధారితమైనవని అర్థము చేసుకొనుట మరొక గంభీరమైన సమస్యలోనికి నడిపిస్తుంది. ఈ మూడు లక్ష్యములలో ఏది ఇతర రెంటి కంటే ప్రధానమైనది? మనము ఆర్థోడాక్సి, ఆర్థోప్రాక్సిస్ మరియు ఆర్థోపాథోస్ లో దేని మీద ఎక్కువ దృష్టిపెట్టాలి?



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

## ప్రాధాన్యతలు

చాలా మంది ఇవాంజెలికల్ విశ్వాసులు దీనికి సూటైన జవాబునిస్తారు. మన నమ్మకములను సరిచేసుకొనుట మీద మొదట దృష్టి పెట్టుట మనకు దేవుడు రూపించిన ప్రాధాన్యత అని వారు నమ్ముతారు, తద్వారా అవి మన క్రియలను మార్చుతాయి మరియు మన క్రియలు మన భావనలను మార్చుతాయి. ప్రాధాన్యతల యొక్క విధానమును ఈ క్రింది విధముగా నిర్మించవచ్చు: "సరిగా ఆలోచించండి, సరైన క్రియలు చేయండి, అప్పుడు మీరు సరైన భావనలు కలిగియుంటారు." వేదాంతశాస్త్రము పట్ల ఈ అవగాహన చాలా వ్యాప్తి చెందినది.

అయితే ఇప్పుడు, ఈ ప్రణాళిక స్పష్టముగా యోగ్యమైనది అనుటలో ఏ సందేహము లేదు. దానిలో ఎటువంటి తప్పిదము లేదుగాని, ఈ ప్రాధాన్యతలను మనము ఎల్లప్పుడూ పాటించినప్పుడు ఒక సమస్య తలెత్తుతుంది. ఎందుకంటే మనము ఎన్నడును మొదటి మెట్టును దాటి ఆలోచన చేయము కాబట్టి, మన వేదాంతశాస్త్రము బలహీనపడిపోతుంది. క్రియల వేదాంతశాస్త్రము మీద ఎక్కువ దృష్టి పెట్టుట ద్వారా భావనలు నిర్లక్ష్యము చేయబడతాయి, లేక దానికి తక్కువ ప్రాధాన్యత ఇవ్వబడుతుంది.

వేదాంతశాస్త్రము యొక్క లక్ష్యములను గూర్చి మన మానవ శరీరములోని ముఖ్యమైన వ్యవస్థలను గూర్చిన ఆలోచన చేయు విధంగా ఆలోచన చేస్తే అది సహాయకరంగా ఉంటుంది. మన శరీరములో పలు ముఖ్యమైన వ్యవస్థలు ఉన్నాయి: కేంద్ర నరముల వ్యవస్థ, జీర్ణ వ్యవస్థ, ఊపిరితిత్తుల వ్యవస్థ, గుండె మరియు రక్తనాళముల వ్యవస్థ. ఇప్పుడు, వీటిలో దేనికి ప్రాధాన్యత ఇవ్వాలి? ఈ వ్యవస్థల మధ్యలో పరస్పర సంబంధములను గూర్చి ఆలోచన చేయునప్పుడు సరైన క్రమము ఏమిటి? నరముల వ్యవస్థ జీర్ణ వ్యవస్థ మీద ఎలాంటి ప్రభావము చూపుతుందో మనము ఆలోచన చేయవచ్చు, కాని జీర్ణ వ్యవస్థ నరముల వ్యవస్థ మీద ఎలాంటి ప్రభావము చూపుతుందో అని కూడా మనము ఆలోచన చేయవచ్చు. ఈ పరస్పర అనుబంధములను గూర్చి ఆలోచన చేయుటకు అనేకమైన సరైన, ఉపయోగకరమైన మార్గములు ఉన్నాయి.

అయితే, వేదాంతశాస్త్రము యొక్క మూడు లక్ష్యముల యొక్క పరస్పర ఆధారితమును గూర్చి మనము ఇప్పటి వరకు చూసిన విషయముల ఆధారంగా, ఎల్లప్పుడూ ఒక ప్రణాళిక లేక ఒక లక్ష్యమును ఎన్నుకొనుట సరైన పని కాదు. ఈ పాఠములలో మనము అనేకసార్లు చూడబోవుతున్నట్టు, మన నమ్మకములు మరియు మన క్రియలు మరియు మన భావనలు పలు అన్యోన్యతల యొక్క వలయములను నిర్మిస్తాయి. వాటి మధ్య అనుబంధములలో అవి కేవలము సూటిగాను లేక సరళముగాను లేకుండా, బహుళ సమానత్వములు, లేక పరస్పర ఆధారత కలిగియుంటాయి, ఎంత వరకంటే మనము అన్ని వేళల ఒకే ప్రాధాన్యతను ఇవ్వలేకపోతాము. మనము సరైన పనులు చేయుటకు సరైన భావనలు కలిగియుండుటకు సరిగా ఆలోచించాలి అను మాట వాస్తవమే. కాని కొన్నిసార్లు సరిగా ఆలోచన చేయుటకు మరియు సరైన భావనలు కలిగియుండుటకు మనము సరైన పనిని కూడా చెయ్యాలి. మరియు సరైన ఆలోచన కలిగియుండుటకు మరియు సరైన కార్యములు చేయుటకు సరైన భావనలు కూడా కలిగియుండాలి. పరిశుద్ధాత్మ ఆయన ప్రజలను వేదాంతశాస్త్ర లక్ష్యములలోనికి అనేక విధములుగా నడిపిస్తాడు.

అయితే ఏమి చెయ్యాలో మనము ఎలా నిర్ణయించుకోవాలి? సరైన ఆలోచన, క్రియలు లేక భావనలలో దేని మీద ఎక్కువ ధ్యాస పెట్టాలి అని మనము ఎలా నిర్ణయించాలి? పరిస్థితికి అనుగుణంగా



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

ఆ పరిస్థితిలో అవసరమైన వేదాంతశాస్త్ర లక్ష్యములకు ప్రాధాన్యతను ఇచ్చు జ్ఞానమును అభివృద్ధి చేసుకోవాలి అనేది ఈ ప్రశ్నకు జవాబు.

"జీవన పరిస్థితి తరచుగా మారుతుంటుంది కాబట్టి, సంతులత అనేది క్షణమాత్రపు సమకాలీనత వంటిది మాత్రమే." జీవితమనేది గాలికి అల్లాడుతున్న ఓడ యొక్క పై భాగము వంటిది. కొన్ని సార్లు అది ఇటు ఒరుగుతుంది, మరి కొన్నిసార్లు అటు ప్రక్కకు ఒరుగుతుంది. అల్లాడుతున్న ఆ ఓడలో మన సంతులతను నిలబెట్టుకొనుటకు మన కాళ్ల క్రింద జరుగుతున్న అలజడికి అనుగుణంగా ఒక వైపుకు లేక మరొక వైపుకు ఒరుగుట మనము నేర్చుకోవాలి. సరైన దిశలో ఒరుగుట మనము నేర్చుకొనకపోతే, మనము నిశ్చయముగా పడిపోతాము. ప్రతి వేదాంతశాస్త్ర బాధ్యతను అనుసరించుటకు ఒకే నిర్ణిత మార్గము లేదు. వేదాంతశాస్త్ర లక్ష్యములను నెరవేర్చుటకు ప్రయత్నించు ప్రతిసారి, మనలను మనము ఈ ప్రశ్న అడగాలి, "ఇక్కడ ఏది అవసరము; ఈ సమయములో మనము మరియు మన చుట్టు ఉన్నవారు ఏమి చెయ్యాలి?" అప్పుడు ఆ సమయముకు తగిన అవగాహన మనకు కలుగుతుంది, మరియు వేదాంతశాస్త్రము యొక్క లక్ష్యములన్నిటిని మన పూర్ణ మనస్సుతో మనము అనుసరించగలము.

తమ ప్రాధాన్యతలను సమయానుసారంగా మార్చుట తెలియని విశ్వాసుల జీవితములో గొప్ప హాని జరుగుతుంది. మనము తరచుగా సాంప్రదాయకతను వక్కాణించినప్పుడు, మనము సులువుగా జ్ఞానవాదము అనే ఉచ్చులో పడిపోతాము. మనము తరచుగా అభ్యాసమును లేక క్రియలను వక్కాణించినప్పుడు, మనము సులువుగా న్యాయవాదము వైపుకు మొగ్గుచూపుతాము. మరియు మనము ఎల్లప్పుడూ వేదాంతశాస్త్రము యొక్క భావనాత్మక లక్ష్యముల మీద దృష్టి పెట్టినప్పుడు, మనము సులువుగా భావుకతావాదములోనికి పడిపోతాము. జీవన నౌక అల్లాడుటకు అనుగుణంగా సమయానుసారంగా జీవిత సమతులనమును నేర్చుకున్నప్పుడు ఈ విపరీత పరిస్థితుల ఉచ్చులో పడకుండా అది మనకు సహాయం చేస్తుంది. కాబట్టి, మనలో ప్రతివారము ఈ ప్రశ్న అడగాలి, "నేను వేదాంతశాస్త్రమును అనుసరించుట వీటిలో ఏ ధోరణి మీద ఆధారపడియున్నది? నేను జ్ఞానవాదము అనే ఉచ్చులో పడే అవకాశము ఉందా; నేను న్యాయవాదము లేక భావుకతావాదము లేక ఈ రెంటి కలయికలో ఒక దాని ద్వారా ప్రభావితము చేయబడుతున్నానా?" మన స్వాభావిక ధోరణులు ఏమైనాసరే, మనము నిర్లక్ష్యము చేయు వేదాంతశాస్త్ర లక్ష్యముల మీద దృష్టిని పెట్టుటకు మనము కష్టపడి పని చేయాలి.

ఇప్పుడు మనము వేదాంతశాస్త్రమును నిర్వచించి వేదాంతశాస్త్రము యొక్క లక్ష్యములను పరీక్షించాము కాబట్టి, మన మూడవ అంశమైన వేదాంతశాస్త్రము యొక్క అంశములు వైపుకు మన దృష్టిని మళ్లించుదాము. వేదాంతశాస్త్రమును మనము పాటించునప్పుడు ఏ ఏ విషయములు మన దృష్టికి వస్తాయి? ఏ అంశము క్రింద మనము ఆర్థోడాక్సి, ఆర్థోప్రాక్సిస్ మరియు ఆర్థోపాథోస్ ను వెదకాలి?

## అంశములు

ఒకనిని వేదాంతశాస్త్రమునకు పరిచయం చేయుట అంటే ఆ వ్యక్తిని విశ్వమునకు పరిచయం చేయుట వంటిది. ఇది చాలా కష్టమైన పని. కాబట్టి, ఈ పాఠములలో వేదాంతశాస్త్రము మీద మన దృష్టిని కేవలం కొన్ని అంశములకు మాత్రమే పరిమితము చేయవలసియున్నది.

మనకు ఆసక్తిని కలిగించు అంశములను అర్థము చేసుకొనుటకు, మనము రెండు విషయములను చూడవలసియున్నది: మొదటిగా, వేదాంతశాస్త్రవేత్తల ముందు ఉన్న అనేక వికల్పములు; మరియు రెండవది, ఈ పాఠములలో మనము చేయు ఎంపికలు. వేదాంతశాస్త్రము యొక్క క్రమబద్ధమైన అధ్యయనములోనికి ప్రవేశించు ప్రతివారి కొరకు వేచియుండు వికల్పములను మొదట మనము చూద్దాము.

## వికల్పములు

ప్రజలు మొదటిగా వేదాంతశాస్త్ర అధ్యయనమును ఆరంభించినప్పుడు, దాని యొక్క విశాలతను చూసి వారు ఆశ్చర్యపడిపోతారు. వేదాంతశాస్త్రములో పొడవాటి అంశముల పట్టిక ఉంటుంది అని ఆలోచించుట సర్వసాధారణమే. క్రైస్తవ విశ్వాసము యొక్క రెండు సహస్రాబ్దుల కాలములో, వేదాంతశాస్త్రము మీద ఎక్కువ ఆసక్తి చూపువారి దృష్టిని అనేక అంశములు ఆకర్షించాయి. ఈ అంశముల యొక్క పట్టిక అనేది వేర్వేరు సంఘముల సమూహములో వేరుగా ఉండేది, కాని కొన్ని ముఖ్యమైన వేదాంతశాస్త్ర వర్గములను అన్ని సంఘములు అంగీకరిస్తాయి.

వేదాంతశాస్త్రము యొక్క అన్వేషణలో కొన్ని అభ్యాసిక అంశములు ఉంటాయి, అవి మిషన్స్, ఇవాంజెలిజం, అపోలోజిటిక్స్ — లేక విశ్వాసమును, ఆరాధనను, కృపా పరిచర్యలను మరియు ప్రసంగశాస్త్రమును సమర్థించుట — లేక ప్రసంగము. దీనిలో అనేక రకముల సిద్ధాంత సంబంధమైన అంశములు కూడా ఉన్నాయి సోటేరియలజి — రక్షణ సిద్ధాంతము, ఎక్లెసియాలజి — సంఘ సిద్ధాంతము, అంత్రోపోలజి — మానవ సిద్ధాంతము, న్యుమటాలజి — పరిశుద్ధాత్మ సిద్ధాంతము, క్రిస్టాలజీ — క్రీస్తు సిద్ధాంతము, థియోలజి ప్రాపర్ — దేవుని సిద్ధాంతము, ఎస్కటాలజి — కడవరి దినముల సిద్ధాంతము, బిబ్లికల్ థియోలజి — బైబిలులో వ్రాయబడిన విమోచన చరిత్ర యొక్క వేదాంతము, సిస్టమాటిక్ థియోలజి — బైబిలు బోధనలను తార్కికముగా అమర్చుట, హిస్టారికల్ థియోలజి — సంఘ చరిత్రలో సిద్ధాంతముల యొక్క అభివృద్ధిని కనుగొనుట, మరియు హెర్మెన్యూటిక్స్ — లేక అనువాదము.

ఇప్పుడు చాలా వరకు, సాంప్రదాయిక అధ్యయన వేదాంతశాస్త్రము సాంప్రదాయకత దృష్టికోణములో నుండి ముఖ్యముగా ఈ అంశముల మీద దృష్టిపెట్టింది: ఈ విషయములను గూర్చి సరైన విధముగా ఆలోచించుట. ఈ అంశములలో ఒక దాని మీద జరుగు ఒక సెమినారి తరగతిలో ఈ అంశములను సరళము చేయుట మీద అందరు సరిగా ఆలోచన చేయునట్లు చూచుట మీద దృష్టిపెడుతుంది. కొన్నిసార్లు, కొన్ని సెమినారి తరగతులు అధ్యయన నైపుణ్యతల మీద దృష్టిపెడతాయి. ఆరాధన, సువార్త ప్రకటన, ప్రసంగ శాస్త్రము మరియు కౌన్సిలింగ్ మీద దృష్టిపెట్టు తరగతులు సాధారణంగా నైపుణ్యతలు లేదా ఆర్థోప్రాక్సిస్ పట్ల ప్రత్యేకమైన శ్రద్ధ కలిగియుంటాయి. దురదృష్టవశాత్తు, ఒక సెమినారి తరగతిలో ఆర్థోప్రాక్సిస్ మీద లేక వేదాంతశాస్త్రము యొక్క భావనాత్మక కోణము మీద, ప్రసంగ శాస్త్రము



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

మీద లేక ప్రసంగమును నేర్పు తరగతి మీద దృష్టి పెట్టుట చాలా అరుదు. అయినను, ఈ పాఠంలో మనము నేర్చుకున్నట్టు, వేదాంతశాస్త్ర అంశముల పట్ల మరింత అనుకూలమైన విధమును కలిగియుండుటకు మన ఆసక్తిని మూడు దిశలలో స్థిరపరచవలసిన అవసరత ఉన్నది. కాబట్టి, ఒక వేదాంతశాస్త్ర విద్యార్థి ఎదుట ఉన్న పని చాలా పెద్దదిగా ఉన్నది. ప్రతి వేదాంతశాస్త్ర అంశములో చూచుటకు లెక్కలేనన్ని దిశలు ఉన్నాయి.

మనము వేదాంతశాస్త్రమును చదువునప్పుడు మన ఎదుట ఉన్న వికల్పముల యొక్క పొడవాటి పట్టిక ఎంపికల యొక్క అవసరతను మనముందుంచుతుంది.

## ఎంపికలు

వేదంతశాస్త్రము యొక్క క్రొత్త విద్యార్థులు తరచుగా ఎదుర్కొను గొప్ప అపాయముంది. వేదాంతశాస్త్ర అంశముల యొక్క సంఖ్య మరియు క్లిష్టత కొన్ని సార్లు వారి శక్తికి మించినది కావచ్చు. వాస్తవానికి, ఈ విద్యా క్షేత్రము ఎంత పెద్దది అంటే చాలా మంది విద్యార్థులు ఈ అంశముల యొక్క పైపై సమాచారమును మాత్రమే నేర్చుకోగలుగుతారు. ఇందు వలన, విద్యార్థులు చాలా సార్లు ప్రత్యేకంగా సాంప్రదాయకత మీద మాత్రమే ఎక్కువ దృష్టిపెడతారు ఎందుకంటే ఇతర కోణములను గూర్చి ఆలోచన చేయుటకు చాలా తక్కువ సమయం ఉంటుంది.

ఈ పాఠములలో అనేకమైన వేదాంతశాస్త్ర అంశముల ద్వారా ముంచివేయబడకుండా కేవలం కొన్ని అంశముల మీద మాత్రమే మన దృష్టిని పెడదాము. ఒక కాపరి ఎదుర్కొను వేదాంతశాస్త్ర సమస్యలు అని మనము పిలచే కొన్ని వేదాంతశాస్త్ర అంశముల మీద మనము దృష్టిని కేంద్రీకరించుదాము. దీని అర్థము ఏమిటంటే కాపరులకు మరియు సంఘ నాయకులకు సూటిగా ఉపయోగపడే నమ్మికలు, అభ్యాసములు మరియు భావనల యొక్క గుంపు. ఈ పాఠములలో సంపూర్ణ వేదాంతశాస్త్రము యొక్క విద్యా సంగ్రహ నిఘంటువు యొక్క పరిచయమును ఇచ్చుటకు మనము ప్రయత్నించుట లేదు. బదులుగా, మనలను మనము ఇలాంటి ప్రశ్నలను అడుగుతాము. సంఘ నాయకత్వము యొక్క తర్ఫీదుపొందు ప్రజలు ఏమి నేర్చుకొనవలసియున్నది; వారు ఏమి చెయ్యాలి; వారు వేదాంతశాస్త్రమును గూర్చి ఎలాంటి భావన కలిగియుండాలి? వేదాంతశాస్త్ర అధ్యయనమును వారు ఏ విధంగా ఆశ్రయించాలి?

సంతోషకరంగా, ఈ ప్రశ్నలకు జవాబులను మనము సృష్టించవలసిన పని లేదు. సంఘము ఇంతకు ముందే మనకు పలు ముఖ్యమైన నిర్దేశములను ఇచ్చింది. శాతబ్దాలుగా సంఘములో వేదాంతశాస్త్ర విద్య అభివృద్ధి చెందుతుండగా, సంఘములోని నాయకుల యొక్క విద్యలో బోధించవలసిన అంశముల రకములను గూర్చి లోకమంతటిలో ఉన్న పలు డినామినేషన్ల వారి మధ్య ఒక ఏకాభిప్రాయం బలపడింది.

దీని వలన, ఒక వేదాంతకళాశాల యొక్క పాఠ్యాంశములు ఈ విధంగా ఉంటాయి. అవి మూడు ముఖ్యమైన భాగములుగా విభజింపబడ్డాయి: బైబిలు విభాగము; చారిత్రిక మరియు సిద్ధాంత విభాగము; మరియు అభ్యాసిక విభాగము. సంఘ నాయకుల కొరకు వేదాంతశాస్త్ర విద్యను అభివృద్ధి చేయుటలో పరిశుద్ధాత్మ సంఘమును నడిపించిన ముఖ్యమైన మార్గములకు ఈ మూడు విభాగములు ప్రాతినిధ్యం వహించుచున్నాయి. సంఘము దాని నాయకులకు అందించు ఈ వేదాంతశాస్త్ర తర్ఫీదు విభాగములను ఇప్పుడు విపులపరచుదాము.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

బైబిలు విభాగము సాధారణంగా పాత నిబంధన అధ్యయనములు మరియు క్రొత్త నిబంధన అధ్యయనములుగా విభజింపబడింది. పాఠ్యాంశములలోని ఈ విభాగములు లేఖనముల యొక్క అంశముల మీద దృష్టిపెట్టి భావి సంఘ నాయకులను బాధ్యతాయుతమైన బైబిలు వ్యాఖ్యానమునకు పరిచయం చేస్తాయి. సిద్ధాంత మరియు చారిత్రిక విభాగమును సంఘ చరిత్ర మరియు క్రమబద్ధమైన వేదాంతశాస్త్రముగా విభజిస్తుంటారు. పలు కాలములలో పలు విధములుగా క్రీస్తు శరీరమైన సంఘము లోకములో ఎలా సంఘర్షణ చేసింది అనే వేదాంతశాస్త్రమును దేవుడు ఎలా అభివృద్ధి చేసాడు అనేదాని మీద సంఘ చరిత్ర దృష్టిపెడుతుంది. సంఘము లేఖనముల యొక్క బోధలను తార్కికముగాను క్రమబద్ధముగాను ఎలా అమర్చినదో క్రమబద్ధమైన వేదాంతశాస్త్రము విద్యార్థులకు తెలియజేస్తుంది. తరవాత అభ్యాసిక విభాగము విద్యార్థుల యొక్క వ్యక్తిగత ఆత్మీయ అభివృద్ధి, ప్రసంగము మరియు సువార్త ప్రకటన వంటి అభ్యాసిక పరిచర్య నైపుణ్యతల వైపు విద్యార్థులను ఆకర్షిస్తుంది.

ఈ పాఠముల వరుసలో మనము ముందుకు కొనసాగుచుండగా, ఈ వేదాంతశాస్త్ర విభాగముల రూపురేఖల యొక్క ప్రాముఖ్యతను మనము గుర్తిద్దాము. మనము మన సొంతదైన ఒక క్రొత్త మార్గమును ఆరంభించుట కంటే, సంఘమునకు ఇంతకు ముందే పరిశుద్ధాత్మ నేర్పించిన పలు కోణములను క్రమపరచుటకు మరియు స్పష్టపరచుటకు ప్రయత్నం చేద్దాము. కాబట్టి, భవిష్యత్త్ పాఠములలో మనము మూడు ముఖ్యమైన అంశములను గూర్చి చర్చిద్దాము. బైబిలు అధ్యయనములు అనే విభాగము మన "లేఖనముల యొక్క వ్యాఖ్యానము" అనే అంశమును పోలియుంటుంది. ఈ పాఠములలో చారిత్రిక మరియు సిద్ధాంత అధ్యయనముల విభాగము "సమాజముతో మన పాలుపంపులు" అనే అంశమునకు దగ్గర సంబంధం కలిగియుంటుంది. అభ్యాసిక వేదాంతశాస్త్రము అనే విభాగము మనము "క్రైస్తవ జీవనము" అని పిలచే అంశమును పోలియుంటుంది.

వేదాంతశాస్త్రము యొక్క ఈ వేర్వేరు విభాగములు ఎలా పని చేస్తాయో, మరియు మనము వేదాంతశాస్త్రమును అన్వేషించుచుండగా అవి కలసి ఎలా పని చేస్తాయో చూద్దాము. మన వేదాంతశాస్త్ర పాఠ్యాంశములలో జ్ఞానవాదము అనే ఉచ్చులో పడిపోవుటకు బదులుగా, వేదాంతశాస్త్ర పాఠ్యాంశముల యొక్క ప్రతి విభాగములోను మనము కనుగొనవలసిన అంశపరమైన, ప్రవర్తనకు సంబంధించిన మరియు భావనలకు సంబంధించిన కోణములు ఉన్నాయని నిరంతరము జ్ఞాపకము చేసుకుందాము. పాత నిబంధన మరియు క్రొత్త నిబంధనలో లేఖనముల యొక్క వ్యాఖ్యానమును మనము చదువునప్పుడు, అంశములు, అభ్యాసములు మరియు భావనలను గూర్చి మనము ఎలా ఆలోచన చెయ్యాలో నేర్చుకోవాలి. సమాజముగా సంఘము ఎలా పాలుపంచుకొంటుంది అని మనము అధ్యయనము చేయునప్పుడు, అంశములు, అభ్యాసములు మరియు భావనల యొక్క ప్రాముఖ్యతను మనము జ్ఞాపకముంచుకోవాలి. మరియు మనము క్రైస్తవ జీవనమును గూర్చి ఆలోచన చేయునప్పుడు, మనము కేవలం ఆర్థోడాక్సి మీద మాత్రమే దృష్టిపెట్టక, ఆర్థోప్రాక్సిస్ మరియు ఆర్థోపాథోస్ ను కూడా పరిగణిద్దాము. మూడు స్థాయిలలోను, లేఖనము యొక్క వ్యాఖ్యానము; సమాజములో పాలుపంపులు; మరియు క్రైస్తవ జీవనము అనే మూడు అంశములు మన వేదాంతశాస్త్ర పరిచయమునకు ముఖ్య అంశములుగా ఉంటాయి.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

## ముగింపు

ఈ పాఠంలో వేదాంతశాస్త్రములోనికి ప్రవేశించుచుండగా మనము అడిగే అత్యంత సామాన్యమైన ప్రశ్నను మనము చూసాము, అది, "వేదాంతశాస్త్రము అంటే ఏమిటి?" ఈ ప్రశ్న యొక్క మూడు విషయములను మనము చూసాము: వేదాంతశాస్త్రము యొక్క నిర్వచనము, వేదాంతశాస్త్రము యొక్క లక్ష్యములు మరియు వేదాంతశాస్త్రము యొక్క అంశములు. మన ముందు ఉన్న ఈ పాఠములలోకి మనము కొనసాగుచుండగా, ఈ పాఠములో చర్చించిన అంశములు మరలా మరలా పునరావృతమవుతాయి. మన సాధారణ ప్రణాళికను దృష్టిలో ఉంచుకుంటే, క్రీస్తుకు మరియు ఆయన సంఘమునకు గొప్ప సేవ చేయు విధముగా వేదాంతశాస్త్రమును అన్వేషించుటకు కావలసిన శక్తిని పొందుతాము.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.